ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 29 జూలై 2025 | 5


పుచ్చల్లంకరేవులో ఇంజన్ పడవలపై విద్యార్థుల రాకపోకలు

గోదారి వడి.. ప్రమాదమే మరి!

పి.గన్నవరం, జూలై28(ఆంధ్రజ్యోతి): ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరిలో విద్యార్థుల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అయోధ్యలంక పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండల పరిధిలో ఉన్నప్పటికీ విద్యార్థులు పడవలో పుచ్చల్లంక, లంకలగన్నవరం రేవులు దాటి ఇవతలివైపు పి.గన్నవరం మండల పరిధిలోని వివిధ ప్రాంతాల పాఠశాలలకు వెళ్లాల్సిందే. విద్యార్థులు నిత్యం నదీపాయను దాటుతున్నా వరదకాలంలో గోదావరిలో సాగే పడవ ప్రయాణం ప్రమాద భరితంగా ఉంటుంది. మర్రిమూల నుంచి లంకలగన్నవరం వైపు, అయోధ్యలంక నుంచి పుచ్చల్లంకవైపు నిత్యం 40 మందికిపైగా ఇలా విద్యార్థులు పడవదాటుతుంటారు. పడవ దాటే సమయంలో లైఫ్‌జాకెట్లు సైతం లేకపోవడంతో వారికి భద్రత లేకుండా పోయింది. ఇటీవల వీరి కష్టాలను చూసిన మంత్రి సుభాష్ ఏర్పాటుచేసిన లైఫ్ జాకెట్లను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలసి మంగళవారం అందించనున్నారు.

తగ్గుతూ.. పెరుగుతూ..


జొన్నాడలో వరద ఉధృతి
కోటిపల్లిలో ఉగ్ర గోదారి

పి.గన్నవరం/ఆలమూరు/కపిలేశ్వరపురం/కె.గంగవరం, జూలై28(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం ఎగువన భద్రాచలంలో గోదావరి నిలకడగా ఉండి తగ్గి.. మళ్లీ పెరుగుతోంది. ధవళేశ్వరంలో ప్రస్తుతం నిలకడగా ప్రవహిస్తూ.. స్వల్పంగా తగ్గుదల ప్రారంభించింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం సముద్రంలోకి 5,85,246 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. దీంతో కోనసీమ జిల్లా పరిధిలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమి నదీపాయలు ఇంకా నిండుకుండల్లా ప్రవహిస్తున్నాయి. వశిష్ఠ నదీపాయ పరిధిలోని బూరుగులంకపాయ నుంచి పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, ఉడిమూడిలంక గ్రామస్తులు, విద్యార్థులు ఇంజన్ పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పెదమల్లంక, అనగార్లంక, అయోధ్యలంక తదితర గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వేను వరద ప్రవాహం తాకింది. ప్రస్తుతం వరదనీరు కాజ్‌పై కింద నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రవాహం మరింత పెరిగితే కాజ్‌వేపై వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. ఇక ఆలమూరు మండలంలో గోదావరి ఉధృతి పెరగడంతో వరదనీరు లంక భూముల్లోకి చేరుతోంది. దీంతో లంక రైతుల్లో ఆందోళన నెలకొంది. జొన్నాడ వద్ద పుష్కర్ ఘాట్ పూర్తిగా ముంపునకు గురికాగా అక్కడ ఉన్న ఆలయాల్లోకి వరద నీరుచేరింది. అలాగు గోదావరి నదీ పరీవాహక ప్రాంత ప్రజలు వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని కపిలేశ్వరపురం తహశీల్దార్ జి. శ్రీనివాస్ కోరారు. ఈ మండలంలోని తాతపూడి, కపిలేశ్వరపురం, పుష్కరఘాట్ల వద్ద వరద పరిస్థితిని ఆయన పరిశీలించారు. కె.గంగవరం మండలంలోని కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పుష్కరాల రేవులో మెట్ల వరకూ వరదనీరు చేరి ఆందోళన కలిగిస్తోంది.



జయలక్ష్మి వచ్చేనా!

జయలక్ష్మి సొసైటీ శఠగోపం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో జయలక్ష్మి సొసైటీ కుంభకోణం బాధితులు ఈసురోమంటున్నారు. స్కాం జరిగి మూడేళ్లు దాటేసినా న్యాయం జరగక లబోదిబోమంటున్నారు. పోగొట్టుకున్న సొమ్ము చేతికి రాక విలవిల్లాడుతున్నారు. ఇంట్లో పిల్లల పెళ్లిళ్లు తదితర కారణాలకు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక నరకయాతన పడుతున్నారు. సీజ్ చేసిన రూ.450 కోట్ల విలువైన ఆస్తుల్లో కొంతైనా వేలం వేసి చిన్న డిపాజిటర్లకు డబ్బులు చెల్లించే వీలున్నా సీఐడీ కనీసం ఆ దిశగా ప్రయత్నం చేయక పోవడంతో బాధితులు అల్లాడుతున్నారు. నష్టపోయిన వారికి చెల్లించడానికి కనీసం 40 శాతం రూ.200 కోట్లు మంజూరు చేయాలని కలెక్టర్ శాన్ మోహన్ సైతం లేఖ రాసినా ఉలుకూపలుకు లేదు. మరో పక్క డిపాజిటర్ల సొమ్ము రూ.43 కోట్లు కొట్టేసి లండన్ పారిపోయిన ఉదయ శంకర్‌ను సీఐడీ ఇప్పటికీ వెనక్కు రప్పించలేక పోయింది. దీంతో తమకెప్పుడు న్యాయం జరుగుతుందంటూ డిపా జిటర్లు రోదిస్తున్నారు. దీనిపై కాకినాడ కలెక్టర్ శాన్ మోహన్ వివరణ కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, సాధ్యమైనంత వరకు భూముల వేలం లేదంటే రూ.200కోట్లు మంజూరయ్యేలా మళ్లీ ప్రభుత్వంతో మాట్లాడతానని తెలిపారు.

సూత్రధారులు వీళ్లే..

కుంభకోణానికి ప్రధాన సూత్రదారులుగా జయలక్ష్మి సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్ చైర్మన్ రాయవరపు బదరీ విశాలాక్ష్మి, డైరెక్టర్లు రాయవరపు జయమణి, చక్రభాస్కరరావు, ప్రబల మల్లిఖార్జునరావు, మంగళంపల్లి వెంకట సుబ్రహ్మణ్యకుమార్, వారణాసి శాంతేశ్వరరావు, దూళ్ల శ్రీనివాస్, ఆర్ నాగేశ్వరరావు, జయశంకర్‌లుగా నిర్ధారించి నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. 159 మంది నిందితులపై సీఐడీ కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచింది. వీరికి సంబంధించిన 98 ఆస్తులకు చెందిన రూ.450 కోట్ల విలువైన స్థిరాస్తులను సొసైటీ చొరవతో సీఐడీ సీజ్ చేసి కోర్టుకు సమర్పించింది. రుణాలు తీసుకున్న 235 మందిపై ట్రిబ్యునల్‌లో కేసు నమోదు చేయగా ఇప్పటివరకు 40 మందిపై కోర్టులో నెంబర్ దాఖలైంది.

ఏళ్ల గడుస్తున్నా న్యాయమేది?

ఈ కుంభకోణానికి సంబంధించి ఇప్పటికీ బాధితులకు న్యాయం జరగలేదు. స్వాధీనం చేసుకున్న ఆస్తులను వేలం వేసి డిపాజిట్‌దారులకు చెల్లింపులు జరిగేలా సీఐడీ ప్రయత్నం చేయాలి. కానీ అదేదీ ఇంకా జరగలేదు. రెడ్ కార్నర్ నోటీసు ద్వారా ఉదయశంకర్‌ను అరెస్ట్ చేసి అప్పుడు వేలం వేయాలని సీఐడీ భావిస్తున్నా అది సాధ్యం కావడం లేదు. ఇదిలా ఉండగా బాధితులకు 40 శాతం కింద రూ.200 కోట్లు తక్షణం విడుదల చేయాలని గతేడాది అక్టోబరులో జిల్లా కలెక్టర్ శాన్‌మోహన్ డీజీపీకి లేఖరాశారు.తద్వారా చిన్న డిపాజిటర్లకు మేలు జరుగుతుందని వివరించారు. చిరు డిపాజిటర్లను దృష్టిలో ఉంచుకుని రూ.200 కోట్లు మంజూరు చేయడం పెద్ద కష్టమైన పనే కాదు.స్థిరాస్తుల వేలం లేదా తాత్కాలిక సర్దుబాటు కింద నిధులు మంజూరు చేసి డిపాజిటర్లకు చెల్లించాల్సి ఉండగా, సీఐడీ కనీసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం లేదు. గత నెలాఖరులోగా 25 శాతం మేర బాధితులకు నగదు పంపిణీ చేసే విధంగా కృషి చేస్తున్నట్లు పాలకవర్గం ప్రకటించినా జరగలేదు. దీంతో న్యాయం కోసం బాధితులు రోడ్డెక్కుతున్నారు. ఇప్పటికే 80మంది చనిపోయారు.కనీసం మృతి చెందిన కుటుంబాలను ఆదుకునేందుకు పాలకవర్గం,అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఎవరెవరు ఎంతిచ్చారు..

వాస్తవానికి బాధితుల్లో ఎక్కువగా రూ.లక్షలోపు డిపాజిట్‌దారులు 13,249 మంది ఉండగా రూ.32.72 కోట్లు చెల్లించాల్సి ఉంది. రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల్లోపు డిపాజిటర్లు 2,384 మంది ఉండగా రూ.37.83 కోట్లు చెల్లించాలి. రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల్లోపు 810 మంది ఉండగా వీరికి రూ.27.99 కోట్లు, రూ.5 లక్షల్లోపు బాధితులు 677 మందికి రూ.30.41 కోట్లు, రూ.5 లక్షలు ఆపైన 2,563 మంది ఉండగా వీరికి రూ.349 కోట్లు చెల్లించాలి.రూ.582 కోట్ల కుంభకోణంలో వైస్ చైర్మన్ విశాలాక్ష్మి ఒక్కరే ఎటువంటి సెక్యూరిటీ లేకుండా బినామీలతో సుమారు రూ.300 కోట్లు కొట్టేయడం గమనార్హం.

రూ.582 కోట్లు కొట్టేశారు...


కాకినాడ రూరల్‌లోని సర్పవరం జంక్షన్ ప్రధాన కేంద్రంగా 1999లో ఏర్పాటైన ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సంస్థ మూడున్నరేళ్ల కిందట ఖాతాదారులకు నిలువునా శఠగోపం పెట్టింది. అధిక వడ్డీల ఆశ చూపించి ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమ, కృష్ణా, విశాఖ జిల్లాల్లో 29 బ్రాంచిల ద్వారా 19,600 మంది నుంచి రూ.582 కోట్ల వరకు డిపాజిట్లు వసూలు చేసి బిచాణీ ఎత్తేసింది. బాధితుల ఆందోళనలతో జిల్లా సహకారశాఖ, సీబీసీఐడీ అధికారులు విచారణ పూర్తి చేసి రూ.582 కోట్ల మేర ఆర్థిక మోసానికి పాల్పడినట్టు గుర్తించారు. 348 పేజీల నివేదికను 2023లో ప్రభుత్వానికి అందించారు. 19 వేల మంది నుంచి రూ.458 కోట్లు డిపాజిట్లు సేకరించినట్టు, 2,245 మందికి రూ.455.78 కోట్లు రుణాలు ఇచ్చినట్లు తేల్చారు. రుణాల్లో కేవలం రూ.120 కోట్లకు మాత్రమే లెక్కలుండగా మిగిలి నవన్నీ బినామీ రుణాలుగా గుర్తించారు. ప్రధానంగా 49 మంది రుణాల కింద రూ.43.04 కోట్లు వైస్ చైర్మన్ విశాలాక్ష్మి మేనల్లుడు ఆకెళ్ల ఉదయశంకర్ నొక్కేశాడని గుర్తించారు. లండన్ పారిపోయిన ఉదయశంకర్‌ను రప్పించేందుకు సీఐడీ అధికారులు రెడ్‌కార్నర్ నోటీసు సైతం జారీ చేశారు.

- రూ.582 కోట్ల కుంభకోణం
- మూడేళ్లు దాటినా నేటికీ అంతే
- రూ.450 కోట్లు ఆస్తులు సీజ్
- అమ్మేసే వీలున్నా అడుగులు నిల్
- రోడ్డెక్కుతున్న బాధితులు
- డిపాజిటర్లు 19,600 మంది
- ఇప్పటికే 80 మంది మృతి
- రూ.200 కోట్లకు కలెక్టర్ ప్రయత్నం
- అయినా కానరాని స్పందన

సీఎం చంద్రబాబును కలుస్తాం..

త్వరలోనే సీఎం చంద్రబాబును కలుస్తాం. బాధితుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేయాలి. ఇప్పటికీ ఒక్క కేసుకీ సేల్ ఆర్డర్ రాకపోవడంతో బాధితులు ఆందోళనలో ఉన్నారు. రూ.300 కోట్ల ఆస్తులపై ట్రిబ్యునల్‌కి వెళ్లగా 11 కేసులకు కోర్టు డిక్రీ ఇచ్చింది.తీర్పు తొందర్లో వస్తే వెంటనే ఆస్తుల వేలం నిర్వహిస్తాం.
- గంగిరెడ్డి త్రినాథరావు, సొసైటీ చైర్మన్

ఆ వంతెనకు ఏమైంది?



వశిష్ఠా గోదావరిపై సుమారు రెండున్నర దశాబ్దాల కిందట చించినాడ బ్రిడ్జి దెబ్బతిందన్న వార్త చర్చనీయాంశమైంది. అసలు ఈ వంతెనకు ఏమైందంటూ అటు, ఇటు ఉన్న పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు ఆరా తీస్తున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాలను కలిపే ఈ చించినాడ బ్రిడ్జికి ఏమైంది ? అధికారులు చెబుతున్నట్టు గడ్డర్లు, బేరింగ్‌లు భారీగా ధ్వంసం కావడానికి కారణాలేంటి.. పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి.. ఈ వంతెన తిరిగి ఎప్పటి నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది..? దీనిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- చించినాడ-దిండి బ్రిడ్జి ధ్వంసం వెనుక కారణాలేంటి..
- గడ్డర్లు, బేరింగ్‌లు ఎందుకు పాడయ్యాయి..
- నిర్వహణా లోపాలు, వాహనాల రద్దీనే కారణమా..
- మరమ్మతులకు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు
- మూడు నెలలపాటు భారీ వాహనాల రాకపోకలు బంద్
- పనులు మొదలు కాగానే పూర్తిగా నిలుపుదల

బోసిపోతున్న చించినాడ బ్రిడ్జి


(నరసాపురం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ, కోనసీమ జిల్లా దిండి మధ్య వశిష్ఠ గోదావరిపై రూ.150 కోట్లతో వంతెన నిర్మాణానికి 1995లో శంకుస్థాపన చేశారు. రెండున్నర కిలోమీటర్ల మేర ఈ ప్రీ స్ట్రెస్ కాంక్రీట్ వంతెన(పీఎస్‌సీ బిడ్జి)ని 2001 నాటికి పూర్తిచేశారు. దీనిని భీమవరం ఆర్‌అండ్‌బీ స్పెషల్ డివిజన్ నిర్మించింది. ఈ బ్రిడ్జి ఏర్పాటుతో గోదావరిని దాటేందుకు ప్రత్యక్ష కనెక్టవిటీ రోడ్డు ఏర్పడింది. రెండు జిల్లాల మధ్య రవాణా అభివృద్ధి జరిగింది. మార్కెట్ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ యాక్సెస్ మెరుగుపడింది. విద్యార్థులు, ఉద్యోగులకు రాకపోకలకు సదుపాయం ఏర్పడింది. ఆర్‌అండ్‌బీ నుంచి నేషనల్ హైవేకు ఈ వంతెన బదిలీ కావడం, కత్తిపూడి-ఒంగోలు సాగరమాల 216 జాతీయ రహదారి అందుబాటులోకి రావడంతో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ ప్రభుత్వం 216 జాతీయ రహదారి నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. బ్రిటిష్ హయాంలో ప్రతిపాదనలో ఉన్న కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు సుమారు 250 కిలోమీటర్ల మేర తీర ప్రాంత వెంబడి జాతీయ రహదారిని విస్తరించింది. రూ.3 వేల కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు 2023లో పూర్తి చేశారు. జిల్లాలో చించినాడ నుంచి లోసరి వరకు 51 కిలోమీటర్ల మేర ఈ రహదారి విస్తరించారు. గతంలో ఒంగోలు నుంచి విశాఖ వెళ్లడానికి విజయవాడ మీదుగా ఒకే మార్గంగా ఉండేది. ఈ రహదారి పూర్తి కావడంతో కోల్‌కతా, ఒడిశా, విశాఖ నుంచి వచ్చే వాహనాలన్నీ కత్తిపూడి మీదుగా ఇటు ఒంగోలు వెళుతున్నాయి. రద్దీ లేకపోవడం, చెక్ పోస్టులు తక్కువ ఉండడంతో వాహనాదారులు ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. వాహనాల రద్దీ పెరగడంతో ఆ ప్రభావం వంతెనపై పడింది. ఈ బ్రిడ్జి మరమ్మతులకు ఓ కారణంగా నిపుణులు చెబుతున్నారు.

మెయింటినెన్స్ లేకపోవడం..

ఏదైనా ఒక నిర్మాణం చేపడితే ఎప్పటికప్పుడు మెయింటినెన్స్ చూడాలి. కానీ ఈ బ్రిడ్జి విషయంలో అటువంటిది ఏమీ లేదు. 2001 నిర్మాణం పూర్తిచేసి ఇప్పటికి పాతికేళ్లు అవుతోంది. అయినప్పటికి ఒకటి, రెండు సందర్భాల్లో ఏదో అరకొరగా పైపై పూతలు పూశారు తప్ప.. అంతకు మించి ఏమీ చేయలేదు. గడ్డర్లు ఎలా వున్నాయి? బేరింగ్స్ పరిస్థితి ఏమిటని ఎప్పుడూ చూసిన దాఖలాలు లేవు. ప్రస్తుతం వంతెనపై పగుళ్లు ఏర్పడడం, గోతులు పడడం, పైకి లేచిన ఇనుప చువ్వలు ప్రమాదకరంగా మారాయి. బ్రిడ్జి గడ్డర్లతోపాటు 26 బేరింగ్‌లు దెబ్బ తిన్నాయి. రెగ్యులర్ నిర్వహణ లేకపోతే బ్రిడ్జి మనుగడ ఎలా ఉంటుందన్నది స్థానికుల ప్రశ్న.

ఉప్పు నీటి సాంద్రత

గోదావరిపై నిర్మించిన ఈ వంతెనకు సమీపంలోనే సముద్రం వుంది. ఈ సముద్రం నుంచి నీరు ఎప్పటికప్పుడు ఎగదన్నుతూ ఉంటుంది. ఉప్పు సాంద్రత వల్ల కూడా ఈ వంతెన నిర్మాణానికి వాడిన ఐరన్ తుప్పు పట్టే అవకాశం ఉంటుందనే ప్రచారం గతంలో సాగింది. అయితే ఇదంతా ఒక ఫేక్‌గా కొట్టి పారేశారు.

మరమ్మతులకు మూడు నెలలు

జాతీయ రహదారి అధికారులు ఇటీవల వంతెనను పరిశీలించారు. గడ్డర్లు, బేరింగ్‌లు పాడైనట్టు గుర్తించారు. వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి మరమ్మతులు చేయాలని ప్రతిపాదించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పనులకు అనుమతులు మంజూరుచేసింది. హైవే అథారిటీ ఆధ్వర్యంలో పనులు చేపట్టడంతో బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. మరమ్మతు పనులకు మూడు నెలల సమయం పట్టనుందని అధికారులు చెబుతున్నారు. చించినాడ బ్రిడ్జికి మరమ్మతు పనులతో భారీ వాహన రాకపోకలు నిలిచిపోవడంతో ప్రధాన రహదారి వెలవెలబోయింది. బైక్‌లు, ఆటోలు, కార్లు వంటి వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. కోనసీమ జిల్లా నుంచి భీమవరం, నరసాపురం కాలేజీలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక మచిలీపట్నంలోని 216 జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్ పర్యవేక్షణలో సుమారు రూ.5 కోట్ల అంచనాతో మరమ్మతు పనులు చేపడతారు. మూడు నెలలపాటు జరిగే పనుల కోసం భారీ వాహనాల రాకపోకలు నిలిపివేశారు. పూర్తిస్థాయి పనులు చేపట్టగానే మొత్తం నిలిపివేస్తారు.

దెబ్బతిన్న గడ్డర్లు, బేరింగ్‌లు

చించినాడ వంతెనపై గడ్డర్లు, 26 బేరింగ్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. బేరింగ్, గెడ్డర్ల తయారీకి ఆర్డర్ ఇచ్చాం. ఈమేరకు పనులు చేపడుతున్నాం. - శ్రీనివాసరావు, ప్రాజెక్టు డైరెక్టర్


అమలాపురం కలెక్టరేట్‌లో అర్జీదారు సమస్య వింటున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు 228 అర్జీలు

అమలాపురం టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌తోపాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా రెవెన్యూ అధికారిణి బీఎల్ఎన్ రాజకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ జిల్లావ్యాప్తంగా వచ్చిన అర్జీదారుల నుంచి 228 అర్జీలను స్వీకరించారు. దివ్యాంగుల వద్దకు డీఆర్వో రాజకుమారి స్వయంగా వెళ్లి అర్జీలను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నూరుశాతం సంతృప్తేలక్ష్యంగా క్షేత్రస్థాయిలో అధికారులు ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. అర్జీదారులు ఫిర్యాదు స్థితిని ఎప్పటికప్పుడు 1100కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు.

టిడ్కో సొమ్ములు తిరిగి చెల్లించాలి...

ఎనిమిదేళ్ల కిందట టిడ్కో భవన సముదాయంలో ఇల్లు వస్తుందని రూ.లక్ష చొప్పున చెల్లించాం. కొందరైతే ప్లాట్ సామర్థ్యాన్ని బట్టి సొమ్ములు కట్టారు. వయసు ఎక్కువ అయిందని, సిబిల్ స్కోరు లేదని, పలు ఇతర కారణాలు చూపించి ప్లాట్లు కేటాయించలేదు. అటు ప్లాట్లు రాక, ఇటు కట్టిన సొమ్ములు తిరిగి రాక చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ బాధితులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తాము చెల్లించిన సొమ్ములు తిరిగి ఇప్పించాలని కోరుతూ కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.

ఎస్పీ కార్యాలయంలో 27 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు పీజీఆర్ఎస్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చినవారి నుంచి అర్జీలను స్వీకరించడంతోపాటు వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఇతర సమస్యలపై 27 అర్జీలు అందాయి. సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్ణీత గడువులోగా బాధితులకు చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని ఆదేశించారు.


జిల్లా పోలీసు కార్యాలయంలో అర్జీదారుని సమస్య వింటున్న ఎస్పీ కృష్ణారావు

వృద్ధాప్య తల్లిదండ్రుల కోసం సంక్షేమ చట్టం : కలెక్టర్

అమలాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ కుటుంబ వ్యవస్థలో పెద్దలు నిర్ణయాత్మక శక్తులుగా ఉండేవారని ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్నచిన్న కుటుంబాలుగా మారడంతో పెద్ద తరాలకు చిన్నతరాలతో సాన్నిహిత్యం లోపించిందని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల పోషణచట్టం 2007 సమర్థవంతంగా అమలుచేయాలని సూచించారు. పిల్లల నిరాధారణతో చాలా మంది వృద్ధులు నిర్లక్ష్యానికి గురై ఆర్థిక ఇబ్బందులతో ఒంటరితనం వల్ల ఎన్నో అవమానాలు భరిస్తూ అవసరాలు తీర్చుకోలేని నిస్సహాయ స్థితిలో జీవనం గడుపుతున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆదరణకు నోచుకోకుండా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 2007 సంక్షేమ చట్టం పెద్దల హక్కులను కాపాడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంక్షేమశాఖ సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లా అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించి ఈ చట్టం గురించి తెలియాల్సి ఉందన్నారు. ఆ దిశగా దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమం కోసం శాఖల వారీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతీ జిల్లాకు ఒక వృద్ధాశ్రమాన్ని ప్రభుత్వపరంగా నెలకొల్పాలని, దీనిలో 150 మంది వృద్ధులు, అనాథ పిల్లలు, నిరాధరణకు గురైన తల్లిదండ్రులు ఉండేలా చూడాలన్నారు. ముఖ్యంగా 60 ఏళ్ల పైబడిన వారికోసం ఉద్దేశించిన ఈ చట్టం ద్వారా ప్రతీ జిల్లా, డివిజన్, మండలంలో ప్రభుత్వ మెయింటెన్స్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. దీని ద్వారా నెలవారీగా వారి సంరక్షణకు రూ.10వేలు చెల్లిస్తారన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సీనియర్ సిటిజన్ల సంక్షేమాధికారి శ్రీనివాస్, వివిధ జిల్లాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీల కోసమే పీఎం అజయ్ పథకం

పీఎం అజయ్ పథకం నూరుశాతం కేంద్ర ప్రాయోజిత పథకమని దీని ద్వారా అదనపు ఉపాధికల్పన, ఎస్సీ ఆధిపత్య గ్రామాల్లో సామాజిక ఆర్థిక సూచికలను మెరుగు పరచడం వంటి వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. ఎస్సీ వర్గాల్లో పేదరికాన్ని తగ్గించడమే ఈ పథక లక్ష్యమన్నారు. ఆ దిశగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ గ్రామాలను రెండు దశల్లో 34 ఎంపికచేసి గ్రామాభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయడం జరిగిందని, త్వరలో ఆ పనులు నిర్వహించడానికి ఉపాధిహామీ పథకంతో అనుసంధానం చేయనున్నట్టు కలెక్టర్ వెల్లడించారు.

ధరల నియంత్రణ : జేసీ

ధరలను పర్యవేక్షించి నియంత్రణలో ఉంచడంతోపాటు ప్రజల ప్రాథమిక అవసరాల వస్తువుల ధరలు వారికి అందుబాటులో ఉండాలని జాయింట్ కలెక్టర్, పర్యవేక్షణ కమిటీ చైర్మన్ టి.నిషాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జిల్లాస్థాయి ధరల పర్యవేక్షణ కమిటీ పనితీరును సభ్యులతో ఆమె సమీక్షించారు. కమిటీ కన్వీనర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అడపా ఉదయ్‌భాస్కర్, మార్కెట్ కమిటీ ఏడీ కె.విశాలాక్షి పాల్గొన్నారు.

'జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పెరిగిన అడ్మిషన్లు'

అమలాపురం టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ తరగతుల్లో అడ్మిషన్లు పెరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం సత్ఫలితాలనిస్తోందని తెలిపారు. గతేడాదికంటే ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగాయన్నారు. కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కళాశాలల్లో చేరమని కోరడంతో ఎందరో విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరడం జరిగిందన్నారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గత ఏడాది 92 మంది విద్యార్థినులు చేరగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో 101 మంది చేరినట్టు ప్రిన్సిపాల్ సాధనాల శాంతిరాజశ్రీ తెలిపారు. అధ్యాపకులు ప్రత్యేక కార్యాచరణతో సత్ఫలితాలు సాధించారన్నారు.

అనధికార లేఅవుట్ల ప్లాట్లు రెగ్యులరైజేషన్‌కు అవకాశం

అమలాపురం టౌన్, జూలై28(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లతోపాటు ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని అమలాపురం మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్, పీనలైజేషన్ రూల్స్‌ను సవరణ చేస్తూ సదరు స్కీమును పొడిగిస్తూ ప్రభుత్వం ఈనెల 26న జీవోఎంఎస్ నంబరు 134ను జారీ చేసిందన్నారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీలోపు అనధికార లేఅవుట్లలో ప్లాట్లుగా రిజిస్ట్రేషన్ జరిగి ఉన్న వాటిని అర్హతగా చేస్తూ అక్టోబర్ 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రెగ్యులరైజ్ కోసం నిబంధనలకు లోబడి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనధికార లేఅవుట్లతోపాటు కొనుగోలుచేసిన ప్లాట్లను త్వరితగతిన రెగ్యులరైజ్ చేసుకునేలా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో కోరారు.



పర్యావరణహితమైన నానో ఎరువులు మార్కెట్లోకి వచ్చి చేరాయి. వీటిని వినియోగించడం వల్ల రైతులకు ముందుగా బరువు భారం తగ్గుతుంది. బస్తా ధరతో పోలిస్తే రేటు కూడా బహు తక్కువే. మారుతున్న కాలానికి అనుగుణంగా నానో ఎరువుల వినియోగాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. నానో ఎరువుల డబ్బాలను రైతులు జేబులో పెట్టుకుని సులువుగా మోసుకుని పంట పొలాలకు వెళ్లవచ్చు.





నానో ఎరువులు

మార్కెట్‌లోకి వచ్చేశాయోచ్!

పర్యావరణ హితం.. ఖర్చు తక్కువ

తగ్గనున్న బరువు భారం

అమలాపురం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు పలకరించడంతో కోనసీమతో పాటు కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో రైతులు తొలకరి పంటలో నిమగ్నమయ్యారు. అధిక దిగుబడులు సాధించేందుకు అనేక రకాల రసాయన ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు వినియోగిస్తున్న ఎరువుల బస్తాబరువు 50 కిలోలు. మార్కెట్ నుంచి ఇంటికి అక్కడి నుంచి పొలానికి ఆ బస్తాలను మోసుకువెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎరువుల బస్తాలను తరలించుకునేందుకు కూలీలకు, వాహన ఖర్చులకు అదనపు ఆర్థిక భారం మోయాల్సి వస్తోంది. బస్తాలోని ఎరువులను పంట పొలాల్లో చల్లిన తర్వాత నీటి తడులు ఎక్కువైనా, నీరు అందకపోయినా ఎరువు వృథా అవుతుంది. వీటితో ఆ పరిస్థితి మాత్రం ఉండదు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నానో ఎరువుల వినియోగంపై ప్రధానంగా దృష్టి సారించింది. రైతులు నానో ఎరువులు వినియోగించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలోని పలు వ్యవసాయ సహకార ప్రాథమిక సంఘాలకు నానో యూరియా, నానో డీఏపీలను రైతులకు అందుబాటులో ఉంచారు. అవగాహన లోపంతో రైతులు ఇంకా యూరియా బస్తాలనే భారంగా మోసుకు వెళ్తున్నారు. పక్క రైతులు ఎవరైనా నానో ఎరువులు వాడిన తర్వాత వినియోగిద్దాం అన్న భావన ఇంకా ఉంది. నానో ఎరువులు వినియోగించడం వల్ల కలిగే లాభాలను అవగాహన సదస్సుల ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వివరిస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

ప్రవీణ్, వ్యవసాయాధికారి, అమలాపురం



నానో ఎరువులను వినియోగించడం వల్ల నేలకు ఏ విధమైన నష్టం జరగదు. పర్యావరణానికి నష్టం వాటిల్లదు. వీటిని స్ప్రేయర్ల ద్వారా, డ్రోన్ల ద్వారా సులువుగా పంటపై పిచికారీ చేసుకోవచ్చు. తద్వారా మొక్కకు నేరుగా 46 శాతం నత్రజని అందుతుంది. రైతులకు ఆర్థిక భారంతో పాటు శారీరక శ్రమ తగ్గుతుంది. రైతులకు అందుబాటులో ఉండేలా మండల పరిధిలోని వన్నెచింతలపూడి, రంగాపురం పీఏసీఎస్‌లలో నానో ఎరువులను అందుబాటులో ఉంచాం. యూరియా బస్తా ధర రూ.1457.29 కాగా కేంద్ర ప్రభుత్వం బస్తా ఒక్కింటికీ రూ.1190.79 సబ్సిడీగా ఇస్తుంది. తద్వారా రూ.266.50కే అందుతుందని చాలా మంది రైతులకు తెలియదు.

ధరలు కూడా తక్కువే...

మార్కెట్‌లో 50 కిలోల యూరియా బస్తా ధర రూ.266 ఉంది. డీఏపీ బస్తా ధర రూ.1,350. వీటిని పొలాల వద్దకు మోసుకు వెళ్లేందుకు రైతులకు అదనంగా ఖర్చవుతుంది. అదే నానో డీఏపీ 500 మిల్లీ లీటర్ల ధర కేవలం రూ.625 మాత్రమే. నానో యూరియా 500 మిల్లీ లీటర్ల ధర రూ.265. వీటిని సులువుగా పొలాలకు తీసుకువెళ్లి పిచికారీ చేసుకోవచ్చు.



ఆటపాటలతో అభ్యాసం

బాల్యానికి భరోసా ఇచ్చేలా, చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేలా ప్రభుత్వం చర్యలు

అంగన్వాడీ కేంద్రాలకు ప్రత్యేక పుస్తకాల సరఫరా

సామర్లకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బాల్యానికి భరోసా ఇవ్వడంతో పాటు వారు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఎదిగేలా ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో మార్పులకు శ్రీకారం చుట్టింది. జాతీయ విద్యా విధానం, జాతీయ పాఠ్య ప్రణాళికల్లో భాగంగా మహిళా- శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్యా శాఖ సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నవచేతన, ఆధార్ శిల అనే రెండు పుస్తకాలను రూపొందించి అంగన్వాడీ కేంద్రాలకు పంపింది. వీటిలోని అంశాలను ఆయా కేంద్రాల కార్యకర్తలు, సహాయకులు అమలు చేయడంతో పాటు చిన్నారుల తల్లిదండ్రులకు వివరించాల్సి ఉంది.


శిక్షణ ఇచ్చి పర్యవేక్షిస్తున్నాం

ప్రభుత్వం పంపిణీ చేసిన ఈ రెండు పుస్తకాలను అంగన్వాడీ కార్యకర్తలకు అందించాము. వీటిలోని అంశాలపై కార్యకర్తలకు, సహాయకులకు శిక్షణ ఇచ్చాము. కేంద్రాల్లో రోజూవారీ కార్యక్రమాల అమలు తీరును పర్యవేక్షిస్తున్నాం.

జి.ఉష, సీడీపీవో
ఐసీడీఎస్ ప్రాజెక్టు, సామర్లకోట



నవచేతన పుస్తకంలో పిల్లల ఎదుగుదల, అభివృద్ధి, పోషణ, ఆరోగ్యంలతో పాటు విద్యాపరమైన అంశాలను పొందుపరిచారు. పసిబిడ్డల పెంపకంలో తల్లి, కుటుంబ సభ్యులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వారితో ఎలా ప్రవర్తించాలి, చిట్టి బుర్రలకు అర్థమయ్యేలా కబుర్లు, కథలు ఎలా చెప్పాలి అనే విషయాలను ఫొటోలతో సహా ఈ పుస్తకంలో పొందుపరిచారు. చిన్నారికి మూడేళ్ల వయసు వచ్చే వరకు ఏం చేస్తే వారు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యకరంగా పెరుగుతారో కూడా వివరించారు. పిల్లలకు ఏ నెలలో ఎలాంటి అంశాలు నేర్పించాలో విశదీకరించారు. ఇందులోని అంశాలపై ఆంగన్వాడీ టీచర్ తమ వద్దకు వచ్చే బాలింతలకు అవగాహన కల్పించాలి.



ఆధార్ శిల పుస్తకంలో పిల్లల సమగ్రాభివృద్ధికి అవసరమైన అంశాలను ఆటల ద్వారా అభ్యాసం చేయించడం, సామాజిక నైపుణ్యాలు పెంపొందించేలా అంశాలను రూపొందించారు. అంతేగాక అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్ల వయసు పిల్లలకు వినోదాత్మకంగా పాఠాలు ఎలా బోధించాలో కూడా వివరించారు. పాఠాలు చెప్పే విధానం మొత్తం ఆటలు ఆడించే ప్రక్రియగా ఉంటుంది.

నన్నయ్య వర్శిటీ భవనాలకు కొత్త పేర్లు



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ముఖద్వారం

- నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణం లోని భవనాల పేర్లు మార్పు
- కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలోని భవనాలకూ నూతన నామాలు
- సంఘసంస్కర్తలు, స్వాతంత్ర్య సమరయోధులు, వివిధ రంగాల్లో ప్రముఖుల పేర్లు పెట్టేలా ఏర్పాట్లు

దివాన్‌చెరువు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాల విద్యార్థుల ఉన్నత విద్య అవసరాలను తీర్చడానికి స్థాపించబడిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఇక్కడి ప్రాంగణంతో బాటు కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలోని పలు భవనాలకు నూతన నామకరణాలు చేయనున్నట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. సంఘసంస్కర్తలు, స్వాతంత్ర్య సమరయోధులతోబాటు వివిధ రంగాల ద్వారా సమాజానికి విశేష సేవలందించిన కొంతమంది ప్రముఖుల పేర్లను ఆయా భవనాలకు నామకరణం చేయాలని విశ్వవిద్యాలయం అధికార వర్గాలు నిర్ణయించుకున్నట్టు సమాచారం. నన్నయ విశ్వవిద్యాలయం స్థానిక ప్రాంగణంలోని కేంద్ర పరిపాలనా భవనానికి సంకల్ప సదన్ అని, ఎమినిటీస్ సెంటర్‌కు సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం, ఇంటర్నేషనల్ వసతిగృహానికి ప్రఖ్యాత ఉద్యమకారుడు భగత్‌సింగ్ సదన్‌గా నామకరణం చేయనున్నారు. అలాగే ఉపకులపతి బంగ్లాకు శ్వేతసౌధగానూ బాలికల వసతిగృహానికి ప్రాణహితగానూ, బాలికల వసతిగృహం మరో భవనానికి కల్పనాచావ్లా పేరును, బాలుర వసతిగృహానికి వశిష్ఠ వసతి గృహంగానూ, బాలుర వసతిగృహం-2కు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరు పెట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. సైన్స్ భవనానికి ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ పేరును, ఇంజనీరింగ్ వర్క్‌షాప్‌లకు కాటన్‌దొరగా గోదావరి ప్రజలు అభిమానించే ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ పేరును, ఇంజనీరింగ్ కళాశాల భవనానికి భారతదేశపు ప్రఖ్యాత ఇంజనీర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరును, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ భవనానికి రతన్‌టాటా పేరును, మల్టీపర్పస్ సెంటర్‌కు సధర్మసదన్‌గా పేర్లు పెట్టనున్నారు. ఇక నన్నయ విశ్వవిద్యాలయం కాకినాడ ప్రాంగణంలోని గ్రంథాలయానికి నారాయణభట్టు విహార్‌గాను, రెండు బాలికల వసతిగృహాలకు జయసంహిత, వసుంధరగా నామకరణం చేయనున్నారు. అలాగే తాడేపల్లిగూడెంలోని నన్నయ ప్రాంగణంలోని బాలికల వసతిగృహానికి నిత్యాన్నదాత్రి డొక్కా సీతమ్మ పేరును నామకరణం చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఈ విషయాలను విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ వద్ద ఆంధ్రజ్యోతి ప్రస్తావించగా ఈ విధంగా త్వరలో నామకరణాలు చేయనున్నట్టు ధ్రువీకరించారు.

నేటి నుంచి పెద్దాపురం నవోదయలో ఆటల పండుగ

పెద్దాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఆటల పండుగ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 450 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,01,116 విరాళం

అయినవిల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన కొమ్మిశెట్టి లోవ మాధవి కుటుంబ సమేతంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని సోమవారం దర్శించుకున్నారు. విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,01,116 విరాళంగా సమర్పించారు. మాధవి కుటుంబానికి ఆలయార్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. దాతను ఈవో అల్లు వెంకటదుర్గాభవానీ అభినందించారు.

పెరుగుతూ.. తగ్గుతూ

- గోదావరి వరద ప్రవాహం
- 5,85,246 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల
- ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద 10.9 అడుగుల నీటిమట్టం



ధవళేశ్వరం వద్ద గోదావరి వరద ప్రవాహం

ధవళేశ్వరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ పరివాహకంలో కురిసిన వర్షాలు వల్ల వస్తున్న వరదనీటితో భద్రాచలం వద్ద తగ్గుతున్న గోదావరి మరలా పెరిగి ప్రవహిస్తుండగా ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి స్వల్పంగా తగ్గుముఖం పడుతోంది. సోమవారం ఉదయం 6లక్షల క్యూసెక్కులను కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి విడుదల చేయగా, సాయంత్రానికి 5,85,246 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది. ఎగువన భద్రాచలం వద్ద ఆదివారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టిన నీటి మట్టం 34.50 అడుగులకు చేరుకోగా లక్ష్మి బ్యారేజ్ నుంచి విడుదల చేసిన వరద నీటితో రాత్రి నుంచి పెరుగుతూ సోమవారం సాయంత్రానికి 36.10 అడుగులుగా నమోదయింది. ఇది మరో నాలుగు, లేదా ఐదు పాయింట్ల మేర పెరిగి ఆపై తగ్గుముఖం పట్టవచ్చని అధికారులు అంచన. వర్షాలు తగ్గుముఖం పట్టి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచారు. తూర్పు డెల్టాకు 3700క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2400 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 6000క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



సత్యారావు మృతదేహం

ధవళేశ్వరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): గోదావరిలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక జాలరిపేటకు చెందిన సవదాల సత్యారావు (45)కు భార్య, ఇద్దరు పిల్లలు. కుటుంబ పోషణకు ఎప్పటిలాగే తోటి మత్స్యకారులతో కలిసి సోమవారం తెల్లవారుజామున కాటన్ బ్యారేజ్ వద్ద వేటకు వెళ్లాడు. సత్యారావు బ్యారేజ్ దిగువున ఉన్న పాత ఆనకట్ట స్కవర్ స్లూయిజ్ మీదుగా నడిచి వెళుతూ ప్రమాదవశాత్తూ స్కవర్ స్లూయిజ్ గేట్లు ఉండే రాతి కట్టడంలోకి పడిపోయాడు. ఆ ప్రాంతం ఇరుకుగా ఉండి వరద నీటితో నిండి ఉండడంతో పైకి రాలేక ప్రాణాలు కోల్పోయాడు. అక్కడే ఉన్న మత్స్యకారులు గమనించి రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మత్స్యకారుల సమాచారంతో పోలీసులు, బంధువులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ధవళేశ్వరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గోదావరిలో చేపల వేటతో జీవనం సాగించే సత్యారావు అదే గోదావరికి బలైపోయాడని తమ కుటుంబానికి దిక్కెవరంటూ భార్య దుర్గ కన్నీరుమున్నీరైంది. ఈ ఘటనతో జాలరిపేట విషాదంలో మునిగిపోయింది.

సిలబస్ రూపకల్పనలో మార్పులు అవసరం

ఎఫ్‌డీపీలో జేఎన్టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద్, అతిథులు

జేఎన్టీయూకే, జూలై 28(ఆంధ్రజ్యోతి): నూతన విద్యావిధానం ప్రకారం అధ్యాపకులు సిలబస్ రూపకల్పనలో తగిన మార్పులు చేసుకోవాలని, విద్యానాణ్యతను మెరుగుపర్చే దిశగా పరిశ్రమల అనుసంధానాన్ని పెంపొందించాలని వర్శిటీ ఉపకులపతి ప్రొపెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ సూచించారు. కాకినాడ జేఎన్టీయూ, వరంగల్‌లోని ఎలక్ట్రానిక్స్ ఐసీటీ అకాడమీ సంయుక్తంగా మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎంఈఐటీవై) భారత ప్రభుత్వ సహకారంతో లెవరేజింగ్ ఓబీఈ ఫర్ కంటిన్యూస్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై వారం రోజుల పాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, అతిథులు ప్రారంభించిన అనంతరం అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ప్రాముఖ్యతను వీసీ వివరించారు. ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ అధ్యాపకులు పరిశోధన, ప్రాజెక్టు ఆధారిత బోధనపై దృష్టిపెట్టాలని సూచించారు. ఎలక్ట్రానిక్స్, ఐసీటీ అకాడమీ చీఫ్ ఇన్వెస్టిగేటర్ పి.రాధాకృష్ణ ఆన్‌లైన్‌లో అధ్యాపకులనుద్దేశించి మాట్లాడగా ఈసీఈ విభాగాధిపతి, ఎఫ్‌డీపీ సమన్వయకర్త డాక్టర్ బి.లీలాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించగా రిసోర్సుపర్సన్లుగా శరత్‌బాబు, వేణుగోపాల్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, డైరెక్టర్లు బాలాజీ, కృష్ణప్రసాద్, రవీంద్ర, 135 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీమూల భావనారాయణుడికి వెండి మకర తోరణం



సర్పవరం జంక్షన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామికి విశాఖ ఎస్ఆర్ పురానికి చెందిన వెంకటాచార్య వైదిక సంస్థానం నిర్వాహకుడు సాతులూరి గోపాలకృష్ణమాచార్యులు రూ.12 లక్షలు విలువచేసే పది కిలోల వెండి మకర తోరణం చేయించారు.సోమవారం దీనిని ఈవో తలాటం వెంకట సూర్యనారాయణ సమక్షంలో శ్రీమూల భావనారాయణ స్వామికి అందజేశారు. దాతకు స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో పుల్ల శ్రీరాములు, మామిడాల శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.19.94 కోట్ల జరిమానాలు

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్రం సమాధానం

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 28 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిబంధనలు ఉల్లంఘించినందుకు దేశవ్యాప్తంగా 30 ప్రభుత్వ ప్రైవేటు కంపెనీలకు మూడు సంవత్సరాల్లో రూ.19.94 కోట్లు జరిమానా విధించినట్టు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. సీఎస్ఆర్ అమలు, నిబంధనలపై సోమవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చింది. ఏపీలో వివిధ కంపెనీల నుంచి సీఎస్ఆర్ నిధుల వ్యయం గణనీయంగా పెరిగినట్టు తెలిపిందన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.663.50 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.986.77 కోట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,129.75 కోట్లు ఖర్చు చేసినట్టు వెల్లడించారు. అర్హత కలిగిన సంస్థలు తమ సగటు లాభాల్లో కనీసం రెండు శాతం సామాజిక కార్యక్రమాలకు కేటాయించాలని, అలా ఖర్చు చేయని నిధులను ప్రభుత్వం నిర్దేశించిన ఖాతాల్లోకి మళ్లించాలని మంత్రిత్వ శాఖ సూచించిందని ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు.

సామర్లకోట మునిసిపాలిటీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా సునేత్రాదేవి

సామర్లకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపాలిటీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా వైస్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవిని నియమిస్తూ సోమవారం రాత్రి డీఎంఏ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. నాలుగేళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన వైసీపీకి చెందిన జి.అరుణపై అదే పార్టీకి చెందిన 26 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించిన విషయం విదితమే. తదుపరి పరిణామాల్లో అరుణ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయడం, కేవలం మూడు రోజుల్లోనే ఉపసంహరించుకోవడం వంటి పరిణామాలు జరిగాయి. దీంతో మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు జరగట్లేదు. తాను విదేశీ పర్యటనకు వెళ్తున్నానని, రెండు నెలలు వరకు కౌన్సిల్‌కు హాజరు కాలేనని అరుణ మున్సిపల్ కమిషనరుకు లేఖ రాసినట్టు తెలిసింది. దీంతో ఆమె విదేశాల నుంచి తిరిగి వచ్చే వరకు కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాల నిర్వహణకు పరిపాలనాపరంగా అడ్డంకులు ఉండకుండా ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా సునేత్రాదేవిని నియమించారు. దీనిపై కమిషనరు శ్రీవిద్యను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని చెప్పారు.

రాజ్యాధికారానికి దూరం చేసే కుట్రే వర్గీకరణ

ఆర్‌పీసీసీఎస్ జాతీయ అధ్యక్షుడు రత్నాకర్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 28(ఆంధ్రజ్యోతి): దళితులను శాశ్వతంగా రాజ్యాధికారం చేపట్టకుండా దూరం చేసేందుకు ఎస్సీ వర్గీకరణ పేరుతో దేశవ్యాప్తంగా రాజకీయ కుట్ర జరుగుతోందని ఆర్‌పీసీసీఎస్ జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులంతా కలసి ఉంటే రాజ్యాధికారం వైపు చూసే అవకాశం ఉంటుందని ఎస్సీ వర్గీకరణ పేరుతో ఐక్యతను దెబ్బతీస్తున్నారన్నారు. దీనికి అన్ని పార్టీలు మద్దతు పలుకుతున్నాయన్నారు. దేశ చరిత్రలోనే ఇంత కుట్ర జరగలేదన్నారు. ముఖ్యంగా మాదిగల ఐక్యతపై దాడి జరుగుతోందన్నారు. ఎస్సీ జాబితాలో 1108 కులాలు ఉన్నాయని, దేశంలో ఎస్సీ సామాజిక వర్గంలో సొంతంగా పార్టీ పెట్టి రాజ్యాధికారం చేపట్టిన కులం చమార్(మాదిగలు)మాత్రమేనన్నారు. చమార్‌లు మిగిలిన ఎస్సీ కులాలకు సొంతంగా రాజ్యాధికారం చేపట్టాలనే ఆలోచన కల్పించారన్నారు. చమార్‌లను దెబ్బకొట్టితే తప్ప ఉత్తర భారతదేశంలో బీజేపీ గెలిచే పరిస్థితులు లేవని చమార్‌లకు చెందిన బీఎస్పీని దెబ్బకొటేందుకు ఎస్సీ వర్గీకరణ తెరపైకి తీసుకువచ్చారన్నారు. కాన్షీరామ్, మాయావతితో పాటు చమార్‌లకు చెందిన పలువురు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా పనిచేశారన్నారు. రిజర్వేషన్ల పేరుతో 100 మందికి నలుగురు మాత్రమే లబ్ధి పొందుతున్నారని ఈ నాలుగు సమంగా పంచుతామంటున్నారని అన్నారు. దళితులంతా గమనించాలన్నారు. తాను దేశవ్యాప్తంగా శాంతియుతంగా పోరాటం చేస్తున్నానని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని మాలలు కళ్లు తెరచి ఈ పోరాటంలో పాల్గొనాలని కోరారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్.. చోరీలకు నో ఛాన్స్‌!



ఎల్‌హెచ్‌ఎంఎస్ పరికరం



- తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు
- లాక్డ్‌ హౌస్‌ మోనటరింగ్‌ సిస్టంతో అదుపు
- సీసీ కెమెరాలతో పట్టుకునే అవకాశం
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కాకినాడ క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లో ఇటీవల దొంగతనాలు పెరిగిపోయాయి. ముఖ్యంగా తాళం వేసి ఉన్న ఇళ్లు గుల్ల అయిపోతున్నాయి. ఈ తరహాలోనే ద్విచక్ర వాహనాల దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఇంటి దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడే ముఠాలను కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్‌ ఆధ్వర్యంలో కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్‌ మనీష్‌ పాటిల్‌ పర్యవేక్షణలో, క్రైం సీఐ వికృష్ణ సిబ్బందితో కలిసి పట్టుకుని అధిక మొత్తంలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇళ్లలో చోరీల కు పాల్పడే దొంగలను పోలీసులు పట్టుకున్న సంఘటనలు జరిగాయి. పోలీస్‌ శాఖ అత్యాధునిక సాంకేతికత ఉపయోగించి నేరాలను చేధించి నిం దితులను పట్టుకుంటున్నారు. అయితే ముందస్తు జాగ్రత్త చర్యలు పాటిస్తే నేరాలను కట్టడి చేయవచ్చని స్పష్టం చేస్తున్నారు. లాక్డ్‌ హౌస్‌ మోనటరింగ్‌ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్‌)పై అవగాహన కల్పిస్తున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ ఉపయోగం ఏంటి?

దూర ప్రాంతాలకు ఎక్కువ రోజులు ఉండే విధంగా ఇళ్లకు తాళం వేసి వెళ్లే సమయంలో ఆయా ప్రాంతాల వాసులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం తెలియపరిస్తే ఆ ఇంటికి పోలీసులు ఉచితంగా లాక్డ్‌ హౌస్‌ మోనటరింగ్‌ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్‌) కెమెరాలను అమర్చుతారు. తద్వారా విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు, డాక్యుమెంట్‌లు దొంగల బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఎల్‌హెచ్‌ఎంఎస్‌ కెమెరాలు అమర్చడం ద్వారా తాళం వేసిన ఇంటిలో దొంగలు పడితే ఆ సమాచారం సంబంధిత పోలీస్‌ అధికారికి, పోలీస్‌ కంట్రోల్‌ రూమ్‌కు, అలాగే ఆ ఇంటి యజమానికి అలారం సిస్టం ద్వారా తెలుస్తోంది. దీంతో వెంటనే దొంగలను సులువుగా పట్టుకోవచ్చు. అలాగే ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఇంటి బయట గేటుకు గాని, మెయిన్‌ డోర్‌కుగాని వేసే తాళం కప్పలు కనబడకుండా జాగ్రత్త పడాలి. ఇంటి బయట గేటులకు తాళం కనిపించే విధంగా వేస్తే యజమానులు ఇంటిలో లేరని గ్రహించి దొంగతనానికి సిద్ధపడే అవకాశం ఉంది. ఇంటి బయట రాత్రి సమయాల్లో లైటు వెలిగేలా చూసుకోవాలి. ముఖ్యంగా ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భద్రత పెరగడంతో పాటు నేరాలు జరగకుండా అరికట్టవచ్చు.

ముందస్తు చర్యలు పాటించాలి



కొంతమంది యువకులు వ్యసనాలకు బానిస లై సులువుగా కష్టపడకుండా జల్సాలు చేసుకునే క్రమంలో ఇళ్లలో చోరీలు, నడిచి వెళ్తున్న మహిళలు, వృద్ధుల మెడలోని బంగారు ఆభరణాలు తస్కరించి చైన్‌ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. సీసీ కెమెరాలు, పోలీస్‌శాఖలో వచ్చిన అత్యాధునిక సాంకేతికత ద్వారా కేసులను త్వరితగతిన చేధించగలుగుతున్నాం. ప్రజలు ముందస్తు జాగ్రత్త చర్యలు పాటిస్తే నేరాలను అదుపు చేయ వచ్చు.

వి.కృష్ణ, క్రైం సీఐ, కాకినాడ

ఆర్మీ నియామక ర్యాలీ, జాతీయ హాకీ టోర్నమెంట్‌కు
పటిష్ట ఏర్పాట్లు : జేసీ



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న జేసీ రాహుల్‌ మీనా

కార్పొరేషన్‌ (కాకినాడ), జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ క్రీడా మైదానం వేదికగా ఆగస్టు 3 నుంచి 20 వరకు ఆర్మీ నియామక ర్యాలీ, 1 నుంచి 12వ తేదీ వరకు జాతీయ జూనియర్‌ మహిళల హాకీ చాంపియన్‌ షిప్‌ పోటీల ఏర్పాట్లను సోమవారం కాకినాడ జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ రాహుల్‌ మీనా పరిశీలించారు. రెవెన్యూ, ఆర్మీ, కాకినాడ నగరపాలక సంస్థ, క్రీడా అభివృద్ధి హాకీ ఆంధ్రప్రదేశ్‌ అధికారులతో ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కాకినాడ జిల్లా అధికార యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ రెండు కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల పారిశుధ్యం, క్రీడాకారులు వసతి, భోజనం ఇతర సదుపాయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలన్నారు. ఈ నెల 30 నాటికి ఏర్పాట్లు పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జేసీ వెంట డీఆర్వో వెంకటరావు, ఆర్డీవో ఎస్‌.మల్లిబాబు, కాకినాడ నగరపాలక సంస్థ ఎస్‌ఈ వెంకటరావు, ఎంహెచ్‌వో డాక్టర్‌ పృథ్వీచరణ్‌, డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్‌, సమాచార, పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇన్నొవేషన్‌ ఇంజనీర్‌ సీహెచ్‌.బాబూరావు, ఆర్మీ అధికారులు, హాకీ ఆంధ్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తులకు వసతిగదుల్లో అసౌకర్యం కలగకుండా చూడాలి



సత్రం గదులను ఇంజనీరింగ్‌ అధికారులతో పరిశీలిస్తున్న చైర్మన్‌

అన్నవరం దేవస్థానం చైర్మన్‌ రోహిత్‌

అన్నవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులకు వసతిగదుల్లో అసౌకర్యం కలగకుండా చూడాలని చైర్మన్‌ రోహిత్‌ ఆదేశించారు. సోమవారం కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఇంజనీరింగ్‌, సీఆర్వో విభాగ అధికారులతో కలసి మరమ్మతులు చేపడుతున్న న్యూ, పాత సెంటినరీ కాటేజీలను పరిశీలించారు. సుమారు 40 గదుల వరకు మర మ్మతులతో ఉండడండంతో శ్రావణ మాసం, పెళ్లిళ్ల సీజన్‌ సందర్భంగా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రతి కాటేజీ నందు పరిశుభ్రత పాటించి మంచాలపై కొత్త పరుపులు, దిండ్లు, దుప్పట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ రామకృష్ణ, సీఆర్వో సూపరెంటెండెంట్‌ నరేష్‌, పెన్నాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన దత్తహోమం

లోక కల్యాణార్థం ఈనెల 25 నుంచి అన్నవరం కొండదిగువన కిర్లంపూడి సత్రంలో జరుగుతున్న 8వ కోటి దత్తహోమం శనివారం పూర్ణాహుతితో ముగిసింది. పలువురు రిటైర్డ్‌ ఉద్యోగులు అవధూత దత్తపీఠాధిపతి ఆశీస్సులతో విశ్వశాంతి కోసం పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ హోమ పూర్ణాహుతి గావించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి సోమవారం తాడేపల్లిగూడెంకు చెందిన మాడేపల్లి నాగరాజు, కృష్ణవేణి దంపతులు రూ.1,01,116లు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.



పీఆర్వోకు విరాళం అందజేస్తున్న దాత



లోవ దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

‘లోవ’ ఆదాయం రూ.67.57 లక్షలు

తునిరూరల్‌, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో హుండీల ఆదాయం గణనీయంగా పెరిగింది. ఆషాఢ మాసోత్సవాల్లో భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. ఆలయ ఉన్నతాధికారుల సమక్షంలో చేపట్టిన లెక్కింపులో 33 రోజులకు రూ.67,57,459 ఆదాయం సమకూరినట్లు ఈవో విశ్వనాథరాజు తెలిపారు. గతేడాది కంటే ఈసారి రూ.26.62 లక్షలు అధికంగా సమకూరిందన్నారు. భక్తుల అవసరాలకనుగుణంగా ఆలయంలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

నల్లజర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన ఘటన తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల శివారు ఏకేఆర్‌జీ కళాశాల సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడుకు చెందిన సింగలూరి శ్రీని వాస్‌ ద్విచక్రవాహనంపై నల్లజర్ల వస్తుండగా ఏకేఆర్‌జీ సమీపంలో ఉన్న మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. కాలు విరిగి అపస్మారకస్థితికి చేరిన శ్రీనివాస్‌ను స్థానికులు సమీపంలో విమ్స్‌ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం తాడేపల్లిగూడెం తరలించారు. ప్రమాదానికి కారణం అయిన లారీని పోలీస్‌స్టేషన్‌ తరలించామని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ సత్యనారాయణ పేర్కొన్నారు.

దుస్తుల దుకాణంలో చోరీ

రావులపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా రావులపాలెంలో జాతీయ రహదారి చెంతనే ఉన్న మారుతీ రెడీమేడ్‌ దుస్తుల దుకాణంలో చోరీ జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. వెదిరేశ్వరం శివారు రాళ్లగంటికి చెందిన పబ్బిసెటి సుబ్బారావు స్థానిక జాతీయ రహదారి చెంతనే దుస్తుల రెడీమేడ్‌ షాపు నిర్వహిస్తున్నాడు. రోజూ ఉదయం వచ్చి రాత్రి వరకూ వ్యాపారం సాగించి తిరిగి ఇంటికి వెళ్లిపోతుంటాడు. ఇదే క్రమంలో ఈనెల 26న రాత్రి వ్యాపారం ముగించి షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. 27న వచ్చిచూసే సరికి దుకాణం వెనుక తలుపులు తెరిచి ఉండడంతో లోపలకి వెళ్లి చూశాడు. కౌంటర్లో ఉండవల్సిన రూ.40వేల నగదు, 18 గ్రాముల బంగారు గొలుసు చోరీ అయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శేఖర్‌బాబు సోమవారం తెలిపారు.

మోతుగూడెంలో పోలీసుల తనిఖీలు

మోతుగూడెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మోతుగూడెంలో సోమవారం నుంచి ఆగస్టు 3 వరకు చేపట్టే మావోయిస్టుల అమరవీరు సంస్మరణ సభలు నేపథ్యంలో మోతుగూడెం ఎస్‌ఐ ఎస్‌కే సాదిక్‌, పోలీస్‌ బృందం, సీఆర్పీఎఫ్‌ ఏ పార్టీ టు సిబ్బంది మోతుగూడెం పోలీస్‌ స్టేషన్‌ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. మోతుగూడెం, రాజమహేంద్రవరం, భద్రాచలం, విశాఖపట్నం రహదారులను ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రధాన కల్వర్టులు, రహదారులను బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. పోలీస్‌ చెక్‌పోస్‌ వద్ద అనుమానితులను ప్రశ్నించారు. ట్రైనింగ్‌ ఎస్‌ఐ, హెడ్‌ కానిస్టేబుల్‌ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో సోమవారం నుంచి విశాఖ నుంచి మోతుగూడెం మీదుగా భద్రాచలం వెళ్లే నైట్‌ సర్వీసులు రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. ఉదయం బస్సు సర్వీసులు యథావిధిగా తిరుగుతాయని వారు చెప్పారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మాధవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల టీచర్‌కు పీహెచ్‌డీ

సామర్లకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం మాధవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు కె.రాధాకృష్ణవేణి అప్లయిడ్‌ సైకాలజీలో పీహెచ్‌డీ పట్టా అందుకుంది. ఈ సందర్భంగా ఎంఈవోలు శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ డీవైఈవో నాయుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాధాకృష్ణవేణి కృషి, పట్టుదలతోనే పీహెచ్‌డీ సాధించిందన్నారు. ఆమెను హెచ్‌ఎం టి.మురళీకృష్ణ, సహచర ఉపాధ్యాయులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు.



పీహెచ్‌డీ గ్రహీత రాధాకృష్ణవేణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

‘తల్లికి వందనం’ డబ్బులు అడిగినందుకు
భర్తపై భార్య కత్తిపీటతో దాడి



దుర్గాప్రసాద్‌ నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ

అమలాపురం టౌన్‌, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం డబ్బులు ఏం చేశావని అడిగినందుకు భర్తపై భార్య కత్తిపీటతో దాడి చేసిన సంఘటన డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ పరిధిలోని సావరం రోడ్డులో సోమవారం జరిగింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పట్టణ ఎస్‌ఐ కిశోర్‌బాబు విలేకర్లకు వివరించారు. సావరంలో నివాసం ఉంటున్న పెనుమాల దుర్గాప్రసాద్‌కు భార్య దుర్గ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం డబ్బులు జమ చేసింది. అయితే ఆ సొమ్ములు ఏం చేశావని భర్త దుర్గాప్రసాద్‌ భార్య దుర్గను ప్రశ్నించాడు. దాంతో మాటామాటా పెరిగి దుర్గాప్రసాద్‌పై భార్య దుర్గ కత్తిపీటతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. భర్త దుర్గాప్రసాద్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భార్య దుర్గపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు.

‘ఉప్పాడ శాశ్వత రక్షణకు డిప్యూటీ సీఎం చర్యలు’

కొత్తపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తరచూ సముద్ర కోతకు గురవుతున్న కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడకు శాశ్వతంగా రక్షణ కల్పించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌ చర్యలు చేపట్టారని జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు చెప్పారు. కాకినాడ జిల్లా కొత్తపల్లిలో సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కుల పంపిణీ అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల హామీలో భాగంగా ఉప్పాడ కోత నివారణకు డిప్యూటీ సీఎం ఇప్పటికే కేంద్రంతో చర్చించి రూ.323 కోట్ల గ్రాంటు మంజూరు చేయించారని తెలిపారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతామన్నారు. ఇటీవల మాయాపట్నంలో సముద్ర కెరటాలు మత్స్యకారుల గృహాల్లోకి ప్రవేశించాయనే సమాచారం పవన్‌ దృష్టికి వెళ్లిందన్నారు. వారికి సహాయం అందిస్తామని తెలిపారు.

పంచాయతీరాజ్‌లో పది వేల మందికి పదోన్నతులు

ఉప ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ
సామర్లకోటలో శిక్షణ తరగతులు



ప్రసంగిస్తున్న ఓఎస్‌డీ వెంకటకృష్ణ

సామర్లకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీ రాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖలో పదివేల మందికి పైబడి పదోన్నతులు వచ్చాయని ఉప ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లాలకు చెంది ఇటీవల ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందిన 46మంది నూతన ఎంపీడీవోలకు నెల రోజుల శిక్షణ తరగతులను ఓఎస్‌డీ వెంకటకృష్ణ ప్రారంభించారు. ప్రిన్సిపాల్‌ కెవిఎస్‌.ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తరగతుల్లో ఓఎస్‌డీ మాట్లాడుతూ పంచాయతీ రాజ్‌ వ్యవస్థను మరింత ప్రజాహితం చేసేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. ప్రజలకు సేవలు మెరుగుపర్చడంతో పాటు ఉద్యోగులందరికీ సకాలంలో పదోన్నతులు వచ్చేలా కృషిచేస్తున్నారన్నారు. ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందిన వారు సమన్వయ, పరిపాలన నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. మండలంలోని అన్ని శాఖల ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ మంచి నాయకులుగా పని చేయాలన్నారు. ప్రజల ఆకాంక్షలు మారుతున్నట్లే అధికారులు వాటిక నుగుణంగా పనిచేయాలన్నారు. నెలరోజుల శిక్షణ తర్వాత ఎంపీడీవోల పరిపాలన తీరులో మార్పులు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షణా కేంద్రాన్ని పరిశీలించి ప్రిన్సిపాల్‌, తదితర ఫ్యాకల్టీలకు సూచనలు చేశారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు గోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 43మంది ఎంపీడీవోలు తొలి బ్యాచ్‌గా శిక్షణ పొందుతున్నట్టు ప్రిన్సిపాల్‌ వివరించారు. వైస్‌ ప్రిన్సిపాల్‌ రమణ, డీడీవోలు శ్రీనివాసరావు, నాతి బుజ్జి, ప్రత్తిపాడు ఏపీడీ మోకా భానుప్రకాష్‌, ఎంపీడీవోలు ఎస్‌ఎస్‌. శర్మ, సుశీల, డి.శ్రీలలిత పాల్గొన్నారు.

మా గోడు వినండి మహాప్రభో!

కాకినాడ కలెక్టరేట్‌లో దివ్యాంగుల వినతి

కలెక్టరేట్‌ (కాకినాడ), జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'నా చేతులు, కాళ్ల చచ్చుబడి మంచానికే పరిమితమైనప్పటికీ కేవలం రూ.6వేలు పింఛను మాత్రమే ఇస్తున్నారు. సదరం సర్టిఫికెట్‌ రీ వెరిఫికేషన్‌ చేసి రూ.15వేలు పింఛను ఇవ్వాలి' అని కాకినాడ జిల్లా పిఠాపురం మండలం గోకవాడకు చెందిన అమ్మల గంటి సత్య సోమవారం కలెక్టర్‌ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చింది. తన కూతురు సత్య బధిరురాలు అని తెలిపింది. సదరం సర్టిఫికెట్‌ రీ వెరిఫికేషన్‌ చేయిస్తామని కలెక్టర్‌ హామీ ఇచ్చారు. మరికొందరు దివ్యాంగులు సమస్యలు తెలిపేందుకు కాకినాడ కలెక్టరేట్‌కు వచ్చి వినతులిచ్చారు.







జాతీయ స్థాయి ప్రదర్శనకు తొండవరం విద్యార్థి ప్రాజెక్టు

అంబాజీపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నేషనల్‌ ఎడ్యూకేషన్‌ డే ఎస్‌ఈపీ 2025 సందర్భంగా న్యూఢిల్లీ ప్రగతి మైదానంలో ఈనెల 28 నుంచి 31 వరకూ జరగనున్న జాతీయ స్థాయి ప్రదర్శనకు కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం తొండవరం విద్యార్థి శ్రీరామ్‌ తేజ తయారు చేసిన ప్రాజెక్టును ప్రదర్శించున్నారు. మినిస్ట్రీస్‌ ఆఫ్‌ ఎడ్యూకేషన్‌ ఇన్నోవేటివ్‌ సెల్‌, ఏఐసీటీఏ ద్వారా జాతీయ స్థాయికి ఏపీ తరుపున ఎంపికైన ఏకైక ప్రాజెక్టు, గ్రాంట్‌ ఇన్‌ ఎయిడ్‌ పొందిన కార్బనయాక్సైడ్‌ ఫిల్టర్‌ను ఉపాధ్యాయుడు గణేష్‌ నరసింహరావు ఆధ్వర్యంలో శ్రీరామ్‌తేజ తయారు చేశాడు. ఈ ప్రాజెక్టును మంగళవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీ పాల్గొనే కార్యక్రమంలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, ఉపాధ్యాయుడిని పాఠశాల హెచ్‌ఎం కేశవాచార్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన ప్రాజెక్టుతో విద్యార్థి శ్రీరామ్‌తేజ

పదో తరగతి విద్యార్థినికి గర్భం

కోనసీమ జిల్లాలోని ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్‌ నిర్వాకం

రాయవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిని కరస్పాండెంట్‌ లోబర్చుకుని గర్భవతిని చేసిన సంఘటన డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని ఓ గ్రామంలో వెలుగుచూసింది. బాలిక ఒక ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. విద్యార్థినికి సుమారు 4 నెలలుగా నెలసరి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వైద్యం చేయించేందుకు ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు బాలిక గర్భవతి అని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కుమార్తెను గట్టిగా నిలదీయడంతో జరిగిన విషయాన్ని బాలిక వివరించినట్టు కుటుంబ సభ్యుల్లో ఒకరు తెలిపారు. సంఘటనపై బాలిక తల్లిదండ్రులు రాయవరం పోలీసులను ఆశ్రయించారు. అయితే ప్రైవేటు పాఠశాలకు 7వ తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉండగా వేరే పాఠశాలలో అడ్మిషన్‌ చూపించి విద్యార్థులకు టెన్త్‌ క్లాస్‌ తరగతులు చెబుతూ కరస్పాండెంట్‌ ఈ నిర్వాకానికి పాల్పడినట్టు సమాచారం. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టుతున్నారు. కేసు కూడా నమోదు చేస్తారని సమాచారం.

గుడ్డుపై వింత ఆకారం



కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో కోడిగుడ్డు పై భాగం వింత ఆకారంలో కనిపించింది. ఇది తల్లి కడుపులో పిండం మాదిరిగా ఉండ టం ఆసక్తిగా మారింది. గ్రామంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సలాది ఆదిలక్ష్మి ఇంటిలో ఉన్న కోడి సోమ వారం ఈ వింత ఆకారంలో ఉన్న గుడ్డును పెట్టింది. పై భాగం పిండం మాదిరిగా ఉండడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– గొల్లప్రోలు రూరల్‌ (ఆంధ్రజ్యోతి)

వెంటాడి.. వేటాడి!

తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఆహారం కోసం ఓ కొంగ ఎంతో ప్రయత్నించింది. ఈలోపే ఓ జలచరం కొంగనే వేటాడుదామనుకున్నా తప్పించుకుంది. తర్వాత కొంగ చేపను పట్టుకుని ఆరగించింది.

– స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, రాజమహేంద్రవరం



భూమి తనదేనని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు
అంతర్వేది,జూలై28(ఆంధ్రజ్యోతి):అంతర్వేదిలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం భూమిని సాగు చేసుకుంటూ లీజుచెల్లిస్తూ 80ఏళ్లుగాజీవనం సాగిస్తున్నానని, ఆ భూమిని ఎవరికో రాసి తనది కాదనిఅధికారులు తెలిపారని సోమవారం కలెక్టరేట్‌లో భూమి తనకు చెందేలా న్యాయంచేయాలని కనుమూరివెంకటలక్ష్మీసత్యసాయిరాజు ఫిర్యాదుచేశారు.

మహిళా క్లబ్‌ను ప్రథమస్థానంలో నిలపాలి
అమలాపురం టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మహిళావాకర్స్ క్లబ్‌ను అంతర్జాతీయంగా ప్రథమ స్థానంలో నిలపాలని వాకర్స్ అంతర్జాతీయ సంస్థ ఏరియా వన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ గోకరకొండ నాగేంద్రరావు పిలుపునిచ్చారు. యర్రమిల్లి అనంతలక్ష్మి అధ్యక్షతన స్థానిక గోఖలేవీధిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను బలోపేతంచేసి రైతులకు సహాయ సహకారాలు అందించే దిశగా త్రిసభ్య కమిటీలు పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. కొత్తలంక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. నడిమింటి సూర్యప్రభాకరం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు ముఖ్య అతిథిగా మాట్లాడారు. గత వైసీపీ పాలనలో సహకార రంగాన్ని, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. 2014-19లో టీడీపీ రైతులకు ఇచ్చిన పలు రాయితీలు అన్నింటినీ రద్దు చేశారన్నారు. రాష్ట్రంలో రూ.25వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు.


పీఏసీఎస్ చైర్‌పర్సన్ సత్యగోపాలకృష్ణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

రూ.1.50లక్షల లోపు రుణాలు అన్నింటినీ మాఫీ చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. అనంతరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సమక్షంలో అసిస్టెంట్ సబ్ కోఆపరేటివ్ ఆఫీసర్ వజ్రపు వెంకటనారాయణ, త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్‌గా పెద్దిరెడ్డి సత్యగోపాలకృష్ణ, సభ్యులుగా బొక్కా అర్జునరావు, పెన్నాడ రామకృష్ణలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ పెద్దిరెడ్డి సత్యగోపాలకృష్ణ మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు అందించడంతో పాటు రైతులకు అవసరమైన అన్ని సేవలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈసందర్భంగా త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్, సభ్యులను పలువురు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, గుద్దటి జమ్మి, దూడల స్వామినాయుడు, పొద్దోకు నారాయణరావు, దాట్ల పృథ్వి, గేదెల రఘునాథ్‌బాబా, గీసాల చంద్రరావు, పొత్తూరి మల్లికార్జునవర్మ, తోలేటి రాంబాబు, తాడి జానకీరామ్, చిక్కం శ్రీనివాసరావు, పీటీవీ వర్మ, గుత్తుల బుజ్జి, పచ్చిమట్ల చైతన్య వర్మ, వీపూరి నాగరాజువర్మ, పొత్తూరి నాగరాజు, వంగా సత్యనారాయమూర్తి, సీఈవో గోదశి సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల కోసం కట్టిన సొమ్ములు తిరిగి ఇవ్వరా?

● ఎనిమిదేళ్లు అవుతున్నా పట్టించుకోరా
● డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం.. సొమ్ములిస్తేనే పనులు చేస్తున్నారు
● మున్సిపల్ సిబ్బంది పనితీరుపై అధికార, విపక్ష కౌన్సిలర్ల ఆగ్రహం


అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారుల తీరుపై అధికార, విపక్షాలు ధ్వజం

అమలాపురం టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.. సిల్టు తీయరు. స్వచ్ఛందంగా సిల్టు తీసుకున్నా దాన్ని తొలగించరు.. డబ్బులిస్తేనే పనులు చేస్తున్నారు.. ఏటా రూ.కోటి ఆదాయం ఇస్తున్నా సర్క్యులర్ బజార్‌లో కనీస వసతులు కల్పించడం లేదు.. టిడ్కో గృహాల కోసం రూ.లక్ష చొప్పున అప్పులుచేసి సొమ్ములు కట్టిన వారికి ఇల్లు లేవు.. కట్టిన సొమ్ములు తిరిగి ఇవ్వకపోవడం అన్యాయమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ తో పాటు అధికార విపక్ష కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన సోమవారం జరిగింది. సర్క్యులర్ బజార్ ద్వారా పురపాలక సంఘానికి ఏటా రూ.కోటి ఆదాయం వస్తుంది, కనీసం టాయిలెట్ సదుపాయం కూడా కల్పించకపోవడం దారుణమని అధికార, విపక్ష కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సర్క్యులర్ బజార్ ఉన్న కంచరచెరువుకు 7.02 ఎకరాల భూమి ఉండగా అది పురపాలక సంఘానికి చెందినదని హైకోర్టు తీర్పు ఇచ్చిందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పేర్కొన్నారు. కంచర చెరువు ప్రాంతంలో ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సర్క్యులర్ బజార్ భవనాన్ని ఆధునికీకరించాలని కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ సూచించారు. గతంలో టాయిలెట్ల నిర్మాణం కోసం రూ.5లక్షలు కేటాయించామని, అసలు ఉన్నాయా లేవా అని కౌన్సిలర్ సంసాని నాని ప్రశ్నించారు. సర్క్యులర్ బజార్‌ను ఇటీవల పరిశీలించానని, మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యాపారులు కోరినందున అందుకు అవసరమైన అంచనాలు రూపొందిస్తున్నట్టు కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ వివరించారు. సర్క్యులర్ బజార్‌లో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు అంశాన్ని జనసేన కౌన్సిలర్ యేడిద శ్రీను ప్రస్తావించారు. బి.సావరం రోడ్డు కొద్దిపాటి వర్షాలకు మునిగిపోతుందని, అక్కడ పూర్తిస్థాయిలో ఆధునికీకరణ పనులు చేపట్టాలని కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ పేర్కొన్నారు. రూ.25లక్షలతో ఆ ప్రాంత అభివృద్ధికి అంచనాలు రూపొందించినట్టు కమిషనర్ వివరణ ఇచ్చారు. రాత్రి అయితే చాలు గడియార స్తంభం సెంటర్ అంధకారంలో ఉంటుందని, కనీసం వీధి లైట్లు కూడా వెలిగించకపోతే ఎలా అని కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర ప్రశ్నించారు. పట్టణంలో లైటింగ్ కోసం రూ.36లక్షలు కేటాయించామని, ఎక్కడా వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదని, శానిటేషన్ అధ్వానంగా ఉందని కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, గొవ్వాల రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైస్కూలు సెంటర్‌లో మురుగునీరు ముందుకు పారే పరిస్థితి లేకుండా పోయిందని, కొద్ది వర్షానికే మురుగునీరు షాపులు, ఇళ్లల్లోకి చేరిపోతుందని ఎమ్మెల్సీ సూర్యనారాయణతో పాటు కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తెచ్చారు. టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు రూ.లక్ష చొప్పున చెల్లించారని, ఎనిమిదేళ్లు అవుతున్నా ఇంత వరకు ఆ సొమ్ములు చెల్లించకపోయిన తీరుపై ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ తో పాటు కౌన్సిలర్లు యేడిద శ్రీను, పిండి అమరావతి తదితరులు ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పురపాలక సంఘాల్లోను ఇదే పరిస్థితి ఉందని, ప్రభుత్వం సొమ్ములు విడుదలచేసి ఆదేశాలు జారీ చేస్తే గానీ ఏమీ చేయలేమని కమిషనర్ నిర్మల్‌కుమార్ వివరించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట అధ్వాన పరిస్థితులు ఉన్నాయి గుర్తించారా అని కౌన్సిలర్ రాజేష్ ప్రశ్నించారు. అయితే ఆయా పనులు చేపట్టాలంటే రూ.30లక్షలు ఖర్చు అవుతుందని, అంచనాలు వేసినట్టు కమిషనర్ వివరించారు. ప్రధాన మంచినీటి విభాగంలో హెచ్‌పీ మోటార్ల ఏర్పాటులో అవకతవకలు జరుగుతున్నాయని కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి ప్రశ్నించారు. కాటన్ రోడ్డుగా పిలిచే ఎన్టీఆర్ మార్గ్‌లోనే జిల్లాకు సంబంధించిన ప్రధాన కార్యాలయాలన్నీ ఉన్నాయని, 1994లో ప్రారంభించిన కాటన్ పార్కు అధ్వానస్థితికి చేరుకున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. పారిశుధ్య ట్రాక్టర్లు అసలు ఏ రోజున వస్తున్నాయో కూడా తెలియని పరిస్థితి ఉందని, రాజేష్‌తో పాటు పలువురు సభ్యులు పేర్కొన్నారు. పురపాలక సంఘంలో అసలు ఎంతమంది కాంట్రాక్టర్లు ఉన్నారని సంసాని బులినాని ప్రశ్నించారు. ఒకరిద్దరు కాంట్రాక్టర్లు మాత్రమే టెండర్లు దక్కించుకుని పనులు చేయని తీరును ప్రశ్నించారు. పట్టణంలో సుమారు 200మంది 300వరకు పనులు చేయాల్సి ఉందన్నారు. ఎందుకు చేయడం లేదని కాంట్రాక్టర్లను ప్రశ్నిస్తుంటే డబ్బులు పడడంలేదని చెబుతున్నారని వివరించారు. ఇద్దరే కాంట్రాక్టర్లకు అన్ని పనులు అప్పగిస్తే అసలు ఎప్పటికి పూర్తిచేస్తారని ప్రశ్నించారు. సమావేశంలో పలు అంశాలపై కౌన్సిలర్లు బండారు గోవిందు, గండి దేవిహారిక, అబ్బిరెడ్డి వెంకటనాగేశ్వరరావు, దొమ్మేటి పరశురాముడు తదితరులు ప్రస్తావించారు.

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం


రాజోలులో అన్న క్యాంటీను భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దేవ

రాజోలు, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ నందమూరి తారక రామారావు స్ఫూర్తితో పేద, మధ్య తరగతి ప్రజల ఆకలి తీర్చేందుకు తక్కువ ధరలో భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు శ్రీషిర్డిసాయిబాబా ఆలయం సమీపంలో నూతనంగా నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపనచేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ ప్రతీ నియోజకవర్గానికి ఒక అన్నక్యాంటీన్ ఉండేలా కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 113నియోజకవర్గాల్లో అన్నక్యాంటీన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ, దిరిశాల బాలాజీ, పిండి సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, సర్పంచ్ రేవు జ్యోతి, ఉపసర్పంచ్ పామర్తి రమణ, అడబాల విజయ్, కాట్నరాజు, అడబాల చంటి, మోకా పార్వతి, వైస్ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, పినిశెట్టి బుజ్జి, ఆరుమిల్లి సాయిబాబు, దారపురెడ్డి బాబ్జి, సత్తిరాజు స్వామి, ఉలిశెట్టి లక్ష్మణరావు, రావి మురళీ పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజా సమస్యల పరిష్కారం
అల్లవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారం సాధ్యమని, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. తూర్పులంకలో టీడీపీ సుపరిపాలనలో తొలిఅడుగు ప్రచారం నిర్వహించారు. అల్లవరం మీదుగా తూర్పులంక, మొగళ్లమూరిగ్రామాలను కలుపుతూ ఆర్టీసీ బస్సును నడపాలని ఎమ్మెల్యే ఆనందరావు కోరగా, డిపో మేనేజర్ అంగీకరించారు. రైతుపొలాల మీదుగా రోడ్డు వేయడానికి నిధులు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, బొర్రా ఈశ్వరరావు, వేగిరాజు వెంకట్రాజు, పచ్చిమాల ఏడుకొండలు, ఆకుల లక్ష్మణరావు, పోతుల నాగరాజు, అల్లు సత్తిబాబు, దాట్ల గోపీరాజు, వడ్డి సుభాషిణి, బీజేపీజిల్లా ఉపాధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, మండలాధ్యక్షుడు కట్టా నారాయణమూర్తి,జనసేన నాయకుడుపెన్మెత్స సోమరాజు, కడలి శ్రీయోగిశ్రీనివాసరావు, జల్లి దొరబాబు, గుబ్బలనాగేశ్వరరావుపాల్గొన్నారు.

చెట్టుకింద ప్రత్యక్షమైన ఆభరణాలు
అయినవిల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీముక్తికాంత క్షణముక్తేశ్వరాలయంలో నెల రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలు మధ్యాహ్నం ఆలయ తాళాలు పగలగొట్టి స్వామివారి ఆభరణాలు అపహరించారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో చెట్టుకింద దొంగిలించిన ఆభరణాలు ప్రత్యక్షమయ్యాయి. ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ స్థానికుల సమక్షంలో స్వామివారి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు
మామిడికుదురు, జూలై 28(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి సోమవారం రాజమహేంద్రవరానికి చెందిన కాలెపు సూర్యసింహాచలం-వీరలక్ష్మి దంపతులు రూ.10వేలు, కాలెపు అప్పనరత్నం-స్వాతి దంపతులు రూ.10వేలు విరాళాలుగా అందించారు. దాత భక్త దంపతులకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు.

స్వర్ణాంధ్ర విజన్ లక్ష్య సాధనకు పనిచేయాలి


గంగలకుర్రు అగ్రహారంలో రీసర్వేపై సర్వేయర్లతో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అంబాజీపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా, నియోజకవర్గాల వారీగా ప్రణాళికలు రూపకల్పన జరిగిందని, శాఖల వారీగా కీలక పురోగతి సూచికలు (కేపీఐ)లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. గంగలకుర్రు అగ్రహారం పంచాయతీ కార్యాలయాన్ని ఆమె సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. తొలుత గంగలకుర్రు అగ్రహారం పరిధిలోని వీర్మాయిపాలెంలో గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు అందించిన జగనన్న కాలనీ సర్వేను జేసీ పరిశీలించారు. అనంతరం ఆమె పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రీసర్వేలో సర్వేయర్ అలసత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరుపట్టిన పరిశీలించారు. విధులకు సక్రమంగా హాజరు కాని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల్లో పురోగతిని తీసుకురావాలని ఆదేశించారు. కౌలుదారులకు సీఆర్సీ కార్డుల జారీ, అన్నదాత సుఖీభవ కార్యక్రమాలపై సమీక్షించారు. రీసర్వే ప్రక్రియలో పురోగతి పురోగతిని సాధించాలని తహశీల్దారు చినబాబును ఆదేశించారు. మండల వ్యవయాధికారి ధర్మప్రసాద్, సర్వేయర్ పెద్దిరాజు, ఆర్ఐ ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి మౌనిక, వీఆర్వోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు గ్రంథావిష్కరణ సభ
యానాం,జూలై28(ఆంధ్రజ్యోతి): యానాం పరంపేటకు చెందినవిశ్రాంతి పుదుచ్చేరి డిప్యూటీ డైరెక్టర్ కమ్అండర్ సెక్రటరీ (ఎల్‌పీడీ) గిడ్డి బలరాం కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ (సీఎస్ఆర్) అనే గ్రంథాన్ని రచించారు. మంగళవారం పొనుగుమట్ల విష్ణుమూర్తి ఆవిష్కరించనున్నారు.

రూ.5కోట్లతో విద్యుత్ సర్కిల్ కాంప్లెక్స్ నిర్మాణం


ఈదరపల్లిలో ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంరూరల్,జూలై28(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లిలో ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయ నూతన భవనానికి అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఏపీఈపీడీసీఎల్ ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.రాజేశ్వరి మాట్లాడుతూ విద్యుత్ సర్కిల్ పరిధిలోని కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండేలా రూ.5కోట్లతో నాలుగు అంతస్తులతో ఈభవనాన్ని నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖడీఈలు కె.రాంబాబు, విజయానంద్, రత్నాలరావు, టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ దున్నాల దుర్గ, వాసురాజు, ముత్తాబత్తుల రమణ, కడిమి అర్జున్, గోసంగి ఆనందరావు, వాకపల్లి వెంకయ్యనాయుడు పాల్గొన్నారు.

కూటమి పాలనలో గ్రామాల అభివృద్ధి
ఐ.పోలవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలనలో గ్రామాల అభివృద్ధితో పాటు బడుగుబలహీన వర్గాలకు సంక్షేమం చేకూరుతున్నట్టు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. గుత్తెనదీవి, జి.వేమవరం గ్రామాల్లో సోమవారం డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌తో కలిసి ఆయన పర్యటించారు. గుత్తెనదీవిలో రూ.38లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. జి.వేమవరంలో రూ.40లక్షలతో నిర్మించిన జడ్పీ ఉన్నత పాఠశాల గదులను ప్రారంభించారు. రూ.21లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. జి.వేమవరంలో రూ.1.75 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, సర్పంచ్‌లు లంకలపల్లి దుర్గాదేవీమునిరాజు, నల్ల సుదర్శన్‌రావు పాల్గొన్నారు.

పెండింగ్ అంశాలపై మల్లాడి చర్చ



యానాం, జూలై 28(ఆంధ్రజ్యోతి): యానాంలోని వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ అంశాలపై పుదుచ్చేరిలోని వివిధ శాఖల కార్యదర్శులతో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు భేటీ అయ్యారు. ప్రజాపనుల శాఖలో పనిచేస్తోన్న 126మంది ఎఫ్‌టీసీఎల్ఆర్‌ల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి కార్యదర్శి ముత్తమ్మ, చీఫ్ ఇంజనీర్ వీరసెల్వం, ఆర్థిక శాఖ కార్యదర్శి కృష్ణమోహన్ ఉప్పుల బృందంతో మల్లాడి సమావేశమయ్యారు. ఈఫైల్ న్యాయశాఖ అభిప్రాయానికి పంపినట్టు మల్లాడి వివరించారు. 81మందిఇళ్లనిర్మాణానికి నిధుల కోసం గృహ నిర్మాణశాఖ కార్యదర్శి కేశవన్‌తో మాట్లాడినట్టు మల్లాడి చెప్పారు. ఉచిత బియ్యం సరఫరాలో 86.50శాతం మందికి ఇస్తున్న కోటాను 93శాతానికి పెంచాలని పౌరసరఫరాల శాఖ కార్యదర్శి ముత్తమ్మను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. 90శాతం వరకు పెంచేందుకు కార్యదర్శి అంగీకరించారని చెప్పారు. పలు పెండింగ్ అంశాలపై మల్లాడి చర్చించారు.

సారా రహిత ఏపీగా తీర్చిదిద్దాలి
అమలాపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సారా రహిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా సోమవారం కామనగరువు, తాండవపల్లి గ్రామాలు, అంబాజీపేట మండలం వక్కలంక గ్రామాల్లో నవోదయం 2.0నిర్వహించినట్టు ప్రొహిబిషన్ అండ్‌ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. సారా రహిత ఆంధ్రప్రదేశ్‌లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆయా గ్రామాల్లో నాటుసారా తయారు చేయడం, విక్రయించడం, తాగడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో బుర్రకథ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో నాటుసారా నిమిత్తం దాడులు నిర్వహించారు. ఎక్కడైనా అనధికారికంగా మద్యం విక్రయాలు జరిపినా, నాటుసారా తయారుచేస్తున్నా 14405టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని సత్యనారాయణ కోరారు.

ఇందుపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు
అమలాపురం రూరల్, జూలై28(ఆంధ్రజ్యోతి): ఇందుపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని మై టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, ప్రధాన కార్యదర్శి దేవరపల్లి వీరేష్‌కుమార్, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, మోటూరి బాలాజీ, చొల్లంగి అప్పాజీ, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, మాడా మాధవి, మల్లుల రామకృష్ణ, విప్పర్తి ఆదినారాయణ, ఉల్లింగి రెడ్డినాయుడు పాల్గొన్నారు.

30న కార్పెంటర్ల ఆవిర్భావ సభ
అల్లవరం, జూలై28(అంధ్రజ్యోతి): అమలాపురం వాసర్లగార్డెన్స్‌లో ఈనెల30న జరిగే రాష్ట్ర కార్పెంటర్ల అసోసియేషన్ 8వ ఆవిర్భావ దినోత్సవ సభను జయప్రదంచేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరవల్లి చినబాబు అన్నారు. అల్లవరం, గోడి, గోడిలంక పరిసర గ్రామాల్లో కార్పెంటర్లను కలిసి కరపత్రాలు అందించారు. నూతన కమిటీప్రమాణ స్వీకారం చేస్తుందన్నారు.

గంజాయి అమ్మితే చర్యలు: ఎస్ఐ
అల్లవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మకాలు జరిపినా, సరఫరా చేసినా, సేవించినా చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్ఐ బి.సంపత్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం రాత్రి అల్లవరం పోలీసుస్టేషన్‌లో గంజాయి కేసులో పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి రవాణా అమ్మకాల అభియోగాలు ఉన్న కొమరగిరిపట్నం, ఓడలరేవు తీర గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.


అలీ అస్గర్‌కు ఘన నివాళి
మామిడికుదురు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ముస్లింల ఆరాధ్య దైవం, ఇమామ్ హుస్సేన్ తనయుడు అలీఅస్గర్‌కు ముస్లింలు కన్నీటి నివాళులర్పించారు. మొహర్రం సంతాప దినాల్లో భాగంగా ఆదివారం రాత్రి నగరం గ్రామంలోని భార్గహేఫాతిమా పంజాలో మజ్లిస్ జరిగింది. అలీఅస్గర్ వర్ధంతిని పురస్కరించుకుని జరిపిన మజ్లిస్ అనంతరం పంజా నుంచి అలీఅస్గర్ ఊయలను తీసి నగరం పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు హుస్సేన్ హుస్సేన్ అంటూ మాతం నిర్వహిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. మత ప్రబోధకుడు మౌలానా సయ్యద్ అబ్బాస్ బాకరీమాట్లాడుతూ అలీఅస్గర్ వృత్తాంతాన్ని భక్తులకు వివరించారు. అధికసంఖ్యలో భక్తులుపాల్గొన్నారు.

'పీ-4ను నిర్బంధం చేస్తే బహిష్కరిస్తాం'
అమలాపురం టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా కాకుండా నిర్బంధం చేస్తే బహిష్కరిస్తామని యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, ఎంటీవీపీఎస్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన పేరుతో ప్రభుత్వం ప్రారంభించిన పీ-4లో సంపన్నులు ముందుకు వచ్చి పేదకుటుంబాలను దత్తత తీసుకోవాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు. అయితే సరైన స్పందన రాకపోవడంతో కార్యక్రమాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులపై నెడుతున్నారని ఆరోపించారు. 72రకాల యాప్‌లు, వివిధరకాలఆన్‌లైన్ వర్కులతో ఉపాధ్యాయులు బోధనేతర పనులతో పనిచేయాల్సి వస్తుందన్నారు.

శివకోటిలో 'సుపరిపాలన'
రాజోలు, జూలై28(ఆంధ్రజ్యోతి):శివకోటిలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు కడలి ఏడుకొండలు, అప్పారి నాని, మట్టపర్తి రమేష్, చెల్లుబోయిన చంద్ర, ఆరుమిల్లి భాను, మధుర కృష్ణశాస్త్రి పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు వసతి కల్పించాలి
రాజోలు, జూలై 28(ఆంధ్రజ్యోతి): శివకోటి గురుకుల బాలికలకు సరైన వసతులు కల్పించాలని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో దళిత చైతన్యవేదిక నాయకులు తహశీల్దార్ సీహెచ్ భాస్కర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్, సభ్యులు చింతా శ్రీనివాస్, మట్టా సురేష్‌కుమార్, చింతా మధుకుమార్ పాల్గొన్నారు. రాజోలు ప్రధాన కార్యాలయంలో విమానటిక్కెట్ బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని సోషల్ వర్కర్, యాలంగి రమేష్ వినతిపత్రం అందజేశారు.

ఇరిగేషన్ సబ్‌డివిజన్ డీఈగా రవిప్రసాద్‌రాజు



పి.గన్నవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం ఇరిగేషన్ సబ్‌డివిజన్ డీఈగా బీహెచ్ రవిప్రసాద్ సోమవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పరిధిలోని ఎండగండి ఇరిగేషన్ ఏఈగా పనిచేస్తున్న ఆయన పి.గన్నవరం సబ్‌డివిజన్ డీఈగా పూర్తి అదనపు బాధ్యలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది, పి.గన్నవరం సాగునీటి డిస్ట్రిబ్యూటరి కమిటీ వైస్‌చైర్మన్ చొల్లంగి సత్యనారాయణమూర్తి, నీటిసంఘం అధ్యక్షుడు కె.సత్యనారాయణరాజు, క్షేత్రస్థాయి సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

దంత వైద్యశాల ఏర్పాటు
మలికిపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): మలికిపురం పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం విజయ ఆసుపత్రిలో రాజోలు దంతవైద్యశాల సహకారంతో దంత వైద్యశాల ఏర్పాటు చేయడం ఈప్రాంత ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం గుడిమెళ్లంకలో విజయ నర్సింగ్ హోమ్‌లో ఏర్పాటుచేసిన క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. డాక్టర్ రమహేష్‌బాబు, డాక్టర్ అలేఖ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి
అమలాపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): వన్నెచింతలపూడిలో తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1620 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యాహక్కు చట్టాన్ని ప్రైవేటు పాఠశాలలు అమలుచేయాలి


ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించిన డీఈవో, డీఎస్వో, వినియోగదారుల ఫోరం వేదిక సభ్యులు

అమలాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల సౌకర్యాలు, భద్రతా అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అడపా ఉదయ్‌భాస్కర్, జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యులు, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలతో సంయుక్తంగా సమావేశం నిర్వహించి ఫీజుల వసూళ్లు, విద్యార్థులకు బస్సుల్లో రవాణా, భద్రత వంటి అంశాలతో పాటు పాఠ్య, నోటు పుస్తకాలను నిర్దేశిత ధరలకు విక్రయించడం వంటి అంశాలపై సమీక్షించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని పాఠశాలల్లో ట్యూషన్ ఫీజు ఒకేవిధంగా ఉండాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు అనుసరిస్తున్న విధివిధానాలపై సమీక్షించారు. డీటీవో దేవిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ స్కూలు యాజమాన్యాలు పూర్తి ఫిట్‌నెస్‌తో వాహనాలు నడపాలని, రహదారి భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, వినియోగదారుల ఫోరం సభ్యులు అరిగెల బలరామమూర్తి, విద్యాశాఖ డిప్యూటీ డీఈవో జి.సూర్యప్రకాష్, పరీక్షల కంట్రోలర్ హనుమంతరావు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి: ఎమ్మెల్యే బుచ్చిబాబు
ఐ.పోలవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు మేలైన సేవలందేలా అధ్యక్షులు కృషి చెయ్యాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సూచించారు. గుత్తెనదీవి, జి.వేమవరం సొసైటీల త్రిమెన్ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమం సోమవారం జరిగింది. ఎమ్మెల్యేతో పాటు డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ హాజరయ్యారు. గుత్తెనదీవి సొసైటీ అధ్యక్షుడిగా చిక్కాల శ్రీనివాస్, సభ్యులుగా చింతా కృష్ణార్జున, పందు చంద్రరావు ప్రమాణస్వీకారం చేశారు. జి.వేమవరం సొసైటీ అధ్యక్షుడిగా పెంట రవిప్రసాద్, సభ్యులుగా దండుప్రోలు లోవరాజు, మామిడిశెట్టి కోదండరాముడు ప్రమాణస్వీకారం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, సర్పంచ్ లంకలపల్లి దురాగదేవీమునిరాజు, కాకర్లపూడి రాజేష్, సాగిరాజు సూరిబాబురాజు, చోడిశెట్టి బ్రహ్మానందం, నీటిసంఘం అధ్యక్షుడు చోడిశెట్టి నాగబాబు, రెల్లు గంగాధరం, సలాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గ సభ్యుడిగా అడబాల



మలికిపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి):కేశనపల్లికి చెందిన అడబాల నరసింహారావును బీజేపీ జిల్లాకార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ జిల్లాఅధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఉత్తర్వులు ఇచ్చారు. నరసింహారావు బీజేపీలో పలు సేవలు, పదవులు చేస్తూ పార్టీకి సేవలందించారు. రాజోలు ఇన్‌చార్జి అడబాల రాంబాబు, మలికిపురం అధ్యక్షుడు మేడిచర్ల చాణిక్య అభినందనలు తెలిపారు.

కోఆపరేటివ్ బ్యాంక్ శాఖ ప్రారంభం
యానాం, జూలై 28(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ యానాం శాఖ నూతన భవనాన్ని పుదుచ్చేరి రిజిస్ట్రార్ ఆఫ్ కోపరేటివ్ సొసైటీస్ (ఆర్‌సీఎస్) యశ్వంతయ్య ప్రారంభించారు. తొలుత ఆయన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ అఖిల్ మాట్లాడుతూ బ్యాంకులు ద్వారా అందించే రుణాలను అర్హులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా పురోగతి చెందాలన్నారు. కార్యక్రమంలో పుదుచ్చేరి బ్యాంక్ ఎండీ కుమారన్, ఏజీఎం రవీంద్రనరాజ్, ఏజీఎం గుణశేఖరన్, యానాం బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ సూర్యనారాయణ, యానాం స్పోర్ట్స్ అధ్యక్షుడు లంక విద్యాసాగర్ పాల్గొన్నారు.

దళితుడిపై దాడి కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేయాలి
అమలాపురం టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): దళితుడు దోనిపాటి మహేష్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడైన అమలాపురం రాయల్ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తుల విజయ్‌కుమార్‌ను తక్షణం అరెస్టు చేయాలని కోరుతూ వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ ఆధ్వర్యంలో సోమవారం అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట సీపీఎం జిల్లా అధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, మాలమహానాడు నాయకుడు గిడ్ల వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గారావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి శెట్టిబత్తుల తులసీ, సాపే రమేష్ తదితరులు ఉన్నారు.

ఇందుపల్లి సొసైటీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం
అమలాపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఇందుపల్లి పీఏసీఎస్ అధ్యక్షునిగా మోటూరి బాలాజీ, సభ్యులుగా కుడుపూడి ఏడుకొండలు, విప్పర్తి రమేష్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ రాష్ట్ర క్యానిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, సర్పంచ్ చొల్లంగి శివాళినీఅప్పాజీ, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఆదాయం రూ.4.13 లక్షలు

ఆత్రేయపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,13,929 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన గాదంశెట్టి వెంకటనారాయణ, సత్యవతి దంపతులు రూ.40,004 విరాళం ఇచ్చారు. ఆలయ సిబ్బంది దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ పూజలు: వాడపల్లి వెంకన్న క్షేత్రంలో సోమవారం సాయం త్రం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓఎస్‌డీ కె.వెంకటకృష్ణ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వారికి అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం వేదాశీర్వచనం తీసుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈయన వెంట సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఎంపీడీవో వెంకటరామన్ తదితరులు ఉన్నారు.

నూకాంబిక హుండీ ఆదాయం రూ.4.56 లక్షలు

ఆలమూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ హుండీల లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజుచౌదరి, రామచంద్రపురం ఇన్‌స్పెక్టర్ బాలాజీ రాంప్రసాద్, గ్రామస్తుల సమక్షంలో జరిగిన హుండీల లెక్కింపులో రూ.4,56,140 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. మే 3వ తేదీ నుంచి జూలై 28 వరకు హుండీలను లెక్కించినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గన్ని వెంకట్రావు, వైట్ల శేషుబాబు, కృష్ణమూర్తి, ఆలయ సిబ్బంది పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చింతలూరు నూకాంబిక అమ్మవారి హుండీలను లెక్కిస్తున్న దృశ్యం



కోటిపల్లిలో ఎస్ఎస్‌జీ టీం సభ్యులతో డిప్యూటీ ఎంపీడీవో గౌరీ కుమారి, గ్రామ కార్యదర్శులు

కోటిపల్లి, బాలాంత్రంలో ఎస్ఎస్‌జీ బృందాల తనిఖీ

కె.గంగవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటిపల్లి, బాలాంత్రం గ్రామాల్లో సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ బృందాలు తనిఖీలు చేశాయి. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పరిసరాల శుభ్రత, కేంద్ర నిధుల వినియోగం తదితర అంశాలపై ర్యాంకింగ్ ఇచ్చేందుకు ప్రశాంత్, పి.మహాలక్ష్మి, ప్రవీణ్, సాయి సభ్యులతో కూడిన బృందాలు తనిఖీలు చేశాయి. అయా గ్రామాల్లో ర్యాండమ్‌గా 16 గృహాలు, 5 ప్రభుత్వ స్థలాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలను పరిశీలించి నివేదిక తయారు చేశారు. టీం సభ్యులు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ గ్రామాల ర్యాంకింగ్‌ల కోసం జిల్లాలోని 315 పంచాయతీల నుంచి 31 ఎంపిక చేశారని, కె.గంగవరంలో బాలాంత్రం, కోటిపల్లిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో తనిఖీలు చేశామని, వాటి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గౌరీ కుమారి, గ్రామ కార్యదర్శులు సత్యనారాయణ, సీతారామయ్య, భాస్కరలక్ష్మి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణం నాణ్యతలో రాజీపడొద్దు

ఆలమూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం గుమ్మిలేరులో నిర్మాణంలో ఉన్న రక్షిత మంచినీటి ట్యాంక్‌ను ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు సోమవారం పరిశీలించారు. గ్రామ మంచినీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని 40వేల లీటర్ల కెపాసిటీతో అదనపు ట్యాంక్ నిర్మాణానికి నిధులు కేటాయించారు. మంచినీటి ఇబ్బందులు లేకుండా ట్యాంక్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశించడంతో ట్యాంక్‌ల నిర్మాణం వేగవంతంగా కొన సాగుతున్నాయి. ఇందులో భాగంగా గుమ్మిలేరు ట్యాంక్ నిర్మాణాలను ఎంపీడీవో రాజు, మోదుకూరు సహకార సంఘం అధ్యక్షుడు ఈదల వీర్రాజుతో కలసి పరిశీలించారు. ట్యాంక్ నిర్మాణం నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.



గుమ్మిలేరులో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజు

అవిడిలో ఉచిత కంటి వైద్య శిబిరం

కొత్తపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): అవిడి గ్రామపంచాయతీ వద్ద సోమవారం కొత్తపేటకు చెందిన సందీప్ ఐ క్లీనిక్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 56 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 12 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. శిబిరంలో సర్పంచ్ రెడ్డి చంటి, సురవరపు రామకృష్ణ, ఐరెడ్డి రామారావు, అడపా ఆనంద్, దూళి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



అవిడిలో సందీప్ ఐ క్లీనిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

స్వర్ణాంధ్ర విజన్ లక్ష్య సాధనకు పనిచేయాలి

అంబాజీపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా, నియోజకవర్గాల వారీగా ప్రణాళికలు రూపకల్పన జరిగిందని, శాఖల వారీగా కీలక పురోగతి సూచికలు (కేపీఐ)లపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. గంగలకుర్రు అగ్రహారం పం చాయతీ కార్యాలయాన్ని ఆమె సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. తొలుత గంగలకుర్రు అగ్రహారం పరిధిలోని పీర్నాయిపాలెంలో గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు అందించిన జగనన్న కాలనీ సర్వేను జేసీ పరిశీలించారు. అనంతరం ఆమె పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రీసర్వేలో సర్వేయర్ అలసత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు పట్టిన పరిశీలించారు. విధులకు సక్రమంగా హాజరుకాని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల్లో పురోగతిని తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవయాధికారి ధర్మప్రసాద్, సర్వేయర్ పెద్దిరాజు, ఆర్ఐ ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి మౌనిక, వీఆర్వోలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



గంగలకుర్రు అగ్రహారంలో సర్వేయర్లతో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

కూటమిపాలనలోనే రాష్ట్రాభివృద్ధి తథ్యం

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి సుభాష్



వైఎస్ఆర్ నగర్‌లో మంత్రి సుభాష్‌కు ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం

ద్రాక్షారామ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి తథ్యమని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు, బాపనయ్యచెరువు, పట్టణంలో 4, 5, 6 వార్డుల్లో ఆయన పర్యటించారు. ఆగస్టులో అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలుచేసి ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, బీసీ సెల్ నాయకుడు పెంకె సాంబశివరావు, ప్రగతి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ నగర్‌లో ఘన స్వాగతం: సాయంత్రం పట్టణంలోని 4, 5, 6 వార్డుల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పర్యటించారు. వైఎస్ఆర్ నగర్‌లో స్థానికులు ఘన స్వాగతం పలికారు. తీన్‌మార్ వాయిద్యాలు, పూలుపరచి స్వాగతం పలికారు. కూటమి పాలనపై మంత్రి ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని నమోదు చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు అక్కల రిష్వంత్ రాయ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వుండవిల్లి శివ, ఆర్గనైజింగ్ కార్యదర్శి అల్లం శ్రీనివాస్, టీడీపీ నాయకులు ఏసుదాను, కొప్పిశెట్టి జగదీష్, జనసేన నాయకుడు బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు పేర్కొన్నారు. సోమవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా నార్కెడిమల్లిలో ఇంటింటికి వెళ్లారు. ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయాన్ని యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.వీరవెంకట సత్యనారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షులు పి.నాగేశ్వరరావు, టి.గణేష్, ఐటీడీపీ వాసంశెట్టి ఉమానాగశివ తదితరులతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు

మండపేట (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. తాపేశ్వరం పంచాయతీ పరిధిలోగల పేకేటిపాకలలో సోమవారం కూటమి తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధిని ప్రజలకు తెలిపారు. వైసీపీ పాలనలో అరాచకం తప్ప జరిగిందేమీ లేదని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ నాయకులు నూని వీర్రాజుచౌదరి, వాసంశెట్టి శ్రీనువాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మండపేట మండలంలోని పేకేటిపాకలలో జరిగిన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిల్ సభ్యులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

ఏఎంసీ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మికి ఘన సత్కారం

ఆలమూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండల పరిషత్ సిబ్బంది సోమవారం సత్కరించారు. ఎంపీడీవో ఎ.రాజు అధ్వర్యంలో నూతన పాలకవర్గ చైర్‌పర్సన్ కొత్తపల్లి వెంకటలక్ష్మిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి మోహర్‌ప్రకాష్, ఏపీవో అరుణకుమారి, మండల పరిషత్ సిబ్బంది వల్లి, సతీష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్ఐ లక్ష్మణ్, సిబ్బంది

మద్యం సీసాలు పట్టివేత

ద్రాక్షారామ, జూలై 28(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ పరిధిలో వేగాయమ్మపేట వద్ద సోమవారం యానాం నుంచి ఆటోలో రవాణా చేస్తున్న 593 మద్యం సీసాలను ద్రాక్షారామ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసులకు అందిన ముందస్తు సమాచారంతో డీఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం వేగాయమ్మపేట వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. యానాం వైపు నుంచి వస్తున్న పాసింజర్ ఆటోను తనిఖీ చేయగా 593 మద్యం సీసాలు గుర్తించామన్నారు. వీటిని రవాణా చేస్తున్న యానానికి చెందిన పత్తి శివసత్యనారాయణ పై పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యం సీసాలతో పాటు, ఆటోను పోలీసులు సీజ్ చేశారు.



వేద పండితుల ఆశీర్వచనం తీసుకుంటున్న తంబళ్లపల్లి ఎమ్మెల్యే

భీమేశ్వరాలయంలో తంబళ్లపల్లి ఎమ్మెల్యే పూజలు

ద్రాక్షారామ, జూలై 28(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని సోమవారం తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకా నాథ్ రెడ్డి సందర్శించారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం నంది మండపంలో వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆయన వెంట వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, వైసీపీ నాయకులు వాసంశెట్టి శ్యామ్, ఎంపీపీ అంబటి భవానీ తదితరులు పాల్గొన్నారు.

'మున్సిపల్ ఆస్తిని కబ్జా చేయలేదు'

మండపేట, జూలై, 28(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ వాటర్ వర్క్స్‌కు సంబంధించిన స్థలాన్ని తమ కుటుంబం కబ్జా చేసిందంటూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కౌన్సిల్‌లో ప్రస్తావించడంలో వాస్తవం లేదని స్థలం యజమాని కట్టుమేను రామకృష్ణ అన్నారు. తమ కుటుంబం స్థలాన్ని కబ్జా చేసి ఉంటే వాటి ఆధారాలను ఎమ్మెల్సీ బయటపెట్టాలని ఆయన అన్నారు. తమ స్థలంలో తాము ప్రహరీ నిర్మించుకుంటే ఆయన అనవసర రాద్ధాంతం చేయడం తగదన్నారు. ఒకవేళ ఎమ్మెల్సీ వద్ద ఆధారాలు ఉంటే చూపించాలని, అంతేకాని తమపై బురద చల్లడం సరికాదన్నారు. ఈ మేరకు కె.రామకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆగస్టు 12న కోనసీమ యూత్ మీట్

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 12న అంతర్జాతీయ యువజనోత్సవం సందర్భంగా రామచంద్రపురంలో కోనసీమ యూత్ మీట్ నిర్వహిస్తున్నట్లు మంత్రి సుభాష్ తెలిపారు. సోమవారం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో కోనసీమ యూత్ మీట్‌కు సంబంధించి వాల్‌పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఆగస్టు 12న బైపాస్ రోడ్డులో ఒక ఫంక్షన్ హాలులో కోనసీమ యూత్ మీట్ నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని యువతలో చైతన్యం నింపేందుకు కోనసీమ యూత్ మీట్ ఉపయోగపడుతుందని తెలిపారు. కోనసీమ జిల్లాలోని యువతీ, యువకులు పాల్గొనాలని మంత్రి కోరారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి



రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

రాయవరం హైస్కూల్‌లో శిలాఫలకం ఆవిష్కరణ

రాయవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న పీఎంశ్రీ పథకంలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 28 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో తొలి విడతలో 21, రెండోవ విడతలో 5 పాఠశాలలను ఎంపిక చేయగా 2025-26 విద్యా సంవత్సరంలో రెండు పాఠశాలలు ఎంపికయ్యాయి. నేడు జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈసీ) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఎంశ్రీ పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం జాతికి అంకితమిస్తున్నది. ఈనేపథ్యంలో జిల్లాలోని రాయవరం తొలి విడతలో పీఎంశ్రీ పాఠశాలకు ఎంపికైన రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లాలోనే బెస్ట్ పాఠశాలగా ఎంపిక చేసి హైస్కూల్‌ను జాతికి అంకిత ఇవ్వనున్న నేపథ్యంలో శిలాఫలకం ఆవిష్కరించనున్నారు. వీటికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



ధర్నా చేస్తున్న పీడీఎస్‌యు నాయకులు

ఆర్డీవో కార్యాలయం వద్ద పీడీఎస్‌యు ధర్నా

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 28 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కళాశాలల ఫీజుల దోపిడీ అరికట్టాలని కోరుతూ సోమవారం పీడీఎస్‌యు ఆధ్వర్యంలో తల్లిదండ్రులు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలలకు ఫీజుల రాయితీ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అవమానాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. లక్షల్లో ఫీజులు బకాయిలు ఉండటంతో కార్పొరేట్ కళాశాలలు వారి నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. తల్లికి వందనం పథకం ఉచిత సీట్లు పొందిన వారికి పెండింగ్‌లో పెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు బి.సిద్దు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ కమిటీలకు ఎంపికైన వారిని సన్మానిస్తున్న దృశ్యం

లొల్లలో బీజేపీ కమిటీలకు ఎంపికైన నేతలకు సన్మానం

రాయవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల బీజేపీ నూతన కమిటీల్లో వివిధ పదవుల్లో ఎంపికైన నేతలను సోమవారం మండలంలోని లొల్ల గ్రామంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో సన్మానించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ మండపేట నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయిరాం మాట్లాడుతూ బీజేపీ మరింత బలోపేతానికి నూతన కమిటీలు కృషి చేయాలన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంపికైన చాత్రాతి జానకి రాంబాబు, కొత్తపల్లి శ్రీదేవి, కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన రాయి వీర్రాజు, తోరం రాము, టి.సూర్యనారాయణరాజులను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, చింతా తమ్మిరెడ్డి, అంగర జనార్ధనస్వామి, ముప్పాటి కృష్ణ, ఈరెళ్ల కృష్ణమూర్తి, బీజేపీ మండపేట టౌన్, రూరల్ అధ్యక్షులు నాళం ఫణి ప్రకాష్, పాలిక రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ సబ్‌డివిజన్ డీఈగా రవిప్రసాద్‌రాజు

పి.గన్నవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం ఇరిగేషన్ సబ్‌డివిజన్ డీఈగా బీహెచ్ రవిప్రసాద్ సోమవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పరిధిలోని ఎండగండి ఇరిగేషన్ ఏఈగా పనిచేస్తున్న ఆయన పి.గన్నవరం సబ్ డివిజన్ డీఈగా పూర్తి అదనపు బాధ్యలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది, పి.గన్నవరం సాగునీటి డిస్ట్రిబ్యూటరి కమిటీ వైస్ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణమూర్తి, నీటి సంఘం అధ్యక్షుడు కె.సత్యనారాయణరాజు, క్షేత్రస్థాయి సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.



అవిడిలో చర్మకారుడికి వస్తువులు సమకూర్చిన ఉపాధ్యాయుడు

పి4 స్ఫూర్తితో చర్మకారుడికి ఉపాధ్యాయుడి చేయూత

కొత్తపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ-4 పథకాన్ని స్ఫూర్తిగా తీసుకున్న ఉపాధ్యాయుడు ఒక చర్మకారుడిని దత్తత తీసుకున్నారు. కొత్తపేట మండలం అవిడి గ్రామ మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆలేటి దుర్గాప్రసాద్ పీ-4 పథకాన్ని స్ఫూర్తిగా తీసుకుని అవిడి రేవులో చెప్పులు కుట్టుకునే చిర్రా స్వామిని దత్తత తీసుకుని అతని వృత్తికి కావల్సిన పరికరాలు, ఐరన్ టేబుల్ అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సూరవరపు రామకృష్ణ, ఐరెడ్డి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలి

కొత్తపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖ డివిజన్‌లో గల కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన ఉద్యాన రైతులు 2025-26 ఖరీఫ్ సంవత్సరానికి ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఉద్యానశాఖ అధికారి కోటేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని సొంత భూమి ఉన్న సాగుదారులు, కౌలు సాగుదారులు ఉద్యాన పంటలను ఈ నమోదు చేయించుకోవాలని కోరారు.

ఎంపీటీసీలకు గౌరవ వేతనం విడుదల చేయాలి

కొత్తపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్‌లో ఎంపీటీసీలుగా ఉన్న వారికి రెండు సంవత్సరాలుగా గౌరవ వేతనం విడుదల చేయడం లేదని ఎంపీటీసీలు కోరుతున్నారు. అవిడి ఎంపీటీసీ దూళి సూరిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రెండేళ్లుగా బకాయిలు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఎంపీటీసీల గౌరవ వేతనం విడుదల కాలేదన్నారు. జిల్లా అధికారులు తమ గౌరవ వేతనాల బకాయిలను విడుదల చేయించాలని కోరుతున్నారు.



వెంకన్న ఆలయంలో దాత కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

వెంకన్న ఆలయానికి విరాళం

కపిలేశ్వరపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం ఒకదాత రూ.11,111 విరాళం అందజేశారు. అంగర గ్రామానికి చెందిన యర్రంశెట్టి చంద్రరావు, గంగాలక్ష్మి దంపతులు స్వామివారి అన్నదానానికి ఈ విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ తెలిపారు. దాత కుటుంబీకులను అర్చకుడు కె. బాలబాలాజి ఆచార్యులు ఆధ్వర్యంలో శేషవస్త్రంతో వారిని సన్మానించి ఆశీర్వచనాలు అందజేసారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకింద ప్రత్యక్షమైన ఆభరణాలు

అయినవిల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీముక్తికాంత క్షణముక్తేశ్వరాలయంలో నెల రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలు మధ్యాహ్నం ఆలయ తాళాలు పగలగొట్టి స్వామివారి ఆభరణాలు అపహరించారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో చెట్టుకింద దొంగిలించిన ఆభరణాలు ప్రత్యక్షమయ్యాయి. ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ స్థానికుల సమక్షంలో స్వామివారి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జగ్గిరెడ్డి

ఎన్నికల హామీలను విస్మరించిన ప్రభుత్వం

ఆత్రేయపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేశారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం పేరవరంలోని ఒక ఫంక్షన్ హాలులో బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశానికి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బోనం సాయిబాబా, ఎంపీపీ కుండా అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. అపంతనం వైసీపీ మండల శాఖ అధ్యక్షుడిగా కనుమూరి శ్రీనివాసరాజుతో పాటు మరో 20 మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.